


రాజధాని అమరావతిపై వైసీపీ
విషప్రచారం,కుట్రలు ఆపడం లేదు.
భూములిచ్చిన 99.5 శాతం మంది
రైతుల అభిప్రాయాలను విస్మరించి,
మిగిలిన అరశాతం మంది
రైతులను అడ్డం పెట్టుకుని
వివాదాలకు తెరలేపుతోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ




సోమవారం 13.07.2026

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 82 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

# రాజధాని నిర్వాసితులకు రెట్టింపు భరోసా



- సీఆర్డీఏ బాధిత కుటుంబాలకు రెట్టింపు జీవన భృతి
- ల్యాండ్ పూలింగ్ రైతులకు యాన్యుటీ పెంపు, రుణమాఫీ అమలు
- పట్టణ మౌలిక వసతుల కోసం రూ.1,122.86 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సీఆర్డీఏ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఊరట కల్పించింది. ట్రంకు రోడ్ల నిర్మాణంలో నివాసాలను కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు జీవన భృతిని రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచాలని నిర్ణయించింది. 12 నెలల పాటు నెలకు రూ. 10 వేల జీవన భృతి అందించనుంది. ఇంటి అద్దెతో కలిపి జీవన భృతి చెల్లింపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఏపీసీఆర్డీఏ చర్చల విధానంలో సవరణలు చేసింది. జులై 7వ తేదీన జరిగిన 63వ ఏపీసీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. సవరించిన జీవన భృతి అమలు చేయాలని ఏపీసీఆర్డీఏ కమిషనర్‌కు ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**రుణమాఫీ అమలు చేయాలి.. :** ల్యాండ్ పూలింగ్ రైతులకు రుణమాఫీ అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజధానిలో రెండో దశలో ల్యాండ్ పూలింగ్ రైతులకు ఏపీ సర్కార్ యాన్యుటీ పెంచింది. మెట్ట భూములకు ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 40 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జరీబు భూములకు ఎకరాకు రూ. 50 వేల నుంచి రూ. 60 వేలకు పెంచింది. 2024 జూన్ 12వ తేదీ తర్వాత ఒప్పందం చేసిన రైతులకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. పదేళ్ల పాటు యాన్యుటీ చెల్లింపులు చేయాలని నిర్ణయించింది. జ=ణూ ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణలు చేసింది. రూ. 10 వేల చొప్పున మెట్ట, జరీబు భూముల యాన్యుటీని ఏపీ సర్కార్ పెంచింది.

మిగతా 2లో...

## రైట్ టైమ్.. రైట్ ప్లేస్.. రైట్ లీడర్ మోదీ



- మోదీ నేతృత్వంలో ప్రపంచ శక్తిగా భారత్: చంద్రబాబు
- వికసిత్ భారత్‌కు ఫలిస్తున్న మోదీ కృషి
- వియత్నాం బాధితుల కోసం కేంద్రంతో సమన్వయం

2 లో..

## వియత్నాం విషాదంపై సీఎం సమీక్ష



- మృతదేహాల తరలింపునకు ప్రత్యేక చర్యలు
- బాధితులకు అన్నివిధాలా అండగా ప్రభుత్వం
- ఎంబసీతో నిరంతర సమన్వయానికి ఆదేశాలు

2 లో..

## పవన్ కల్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉంది: చంద్రబాబు



**ముంబయి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుడి భుజానికి నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైందని, ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్ కల్యాణ్‌ను ఆదివారం పరామర్శించిన చంద్రబాబు, ఆయనతో పాటు సతీమణి అన్నా కొణిదలతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశమై చికిత్స వివరాలను తెలుసుకున్నారు.

మీడియాతో చంద్రబాబు మాట్లాడుతూ, ఏళ్లుగా రెండు భుజాల్లో తీవ్రమైన గాయాలు ఉన్నప్పటికీ ప్రజాసేవలో నిమగ్నమై పవన్ కల్యాణ్ వాటిని పట్టించుకోలేదన్నారు. అభిమానుల రద్దీ, తోపులాటల కారణంగా భుజాల సమస్య మరింత తీవ్రమైందని, ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో కుడి భుజానికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో మూడున్నర గంటలపాటు విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించినట్లు చెప్పారు.

శస్త్రచికిత్స అనంతరం మూడు వారాలపాటు వైద్యుల పర్యవేక్షణలో ఫిజియోథెరపీ కొనసాగుతుందని,

మిగతా 2లో...

## ఆటోనగర్‌లో అగ్నికీలలు

- మెకానిక్ షెడ్డులో మంటలు..
- కాలి బూడిదైన 7 ప్రైవేటు బస్సులు
- వెల్డింగ్ నిప్పురవ్వలతో చెలరేగిన అగ్ని ప్రమాదం
- స్థానికుల సాహసంతో తప్పిన మరింత భారీ నష్టం

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ నగరంలోని ఆటోనగర్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఓ మెకానిక్ షెడ్డులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఏకంగా ఏడు ప్రైవేటు బస్సులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భారీ ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లింది.

**వెల్డింగ్ చేస్తుండగా ఎగిరిపడిన నిప్పురవ్వలు :** ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్డుకు మరమ్మతుల కోసం పలు బస్సులను తీసుకువచ్చారు. అక్కడ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన చాలా బస్సులను పార్కింగ్ చేసి ఉంచారు. ఆదివారం ఓ బస్సుకు మెకానిక్ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు.

మిగతా 2లో...



## హరిత విప్లవానికి శ్రీకారం



- 'మిషన్ 5 మిలియన్ ట్రీస్' కార్యక్రమాన్ని ప్రారంభించిన అమిత్ షా
- నగరవ్యాప్తంగా 50 లక్షల మొక్కల నాటడమే లక్ష్యం
- ప్రజల భాగస్వామ్యానికి ప్రత్యేక యాప్

**అహ్మదాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఇవాళ సరికొత్త హరిత విప్లవం ప్రారంభమైంది. అహ్మదాబాద్ నగరం అంతటా 50 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్న'మిషన్ 5 మిలియన్ ట్రీస్' కార్యక్రమాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారికంగా ప్రారంభించారు. నగరంలోని సైన్స్ సిటీ ప్రాంతంలో జరిగిన ఈ సామూహిక ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, పలు ప్లాంటేషన్ ప్రాజెక్టులకు అమిత్ షా శంకుస్థాపన చేశారు.

మిగతా 2లో...

## హర్మూజ్ మళ్లీ మూత..!

- జలసంధి మూసివేతతో గల్ఫ్ దేశాల్లో ఆందోళన
- ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు మరింత తీవ్రం
- కువైట్, ఖతార్, బహ్రెయిన్‌ల్లో భద్రతా హెచ్చరికలు


2

## బుల్లెట్ స్పీడ్‌లో అమరావతి

- హైదరాబాద్‌కు కేవలం 70 నిమిషాల ప్రయాణం
- రాజధాని మీదుగానే హైస్పీడ్ రైల్ కారిడార్
- ఏపీలో 9 స్టేషన్లకు ప్రతిపాదనలు

## విశాఖలో భూప్రకంపనలు

- బంగాళాఖాతంలో 4.5 తీవ్రతతో భూకంపం
- విశాఖ, కాకినాడ తీరప్రాంతాల్లో 7 సెకన్ల పాటు ప్రకంపనలు
- ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం లేకపోవడంతో ఊరట



**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఆదివారం తెల్లవారుజామున 4.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కాకినాడకు 225 కి.మీ దూరంలో బంగాళాఖాతంలో 10 కి.మీ లోతులో భూకంప కేంద్రాన్ని అధికారులు గుర్తించారు.

సాగర నగరం విశాఖలో ఒక్కసారిగా అలజడి, ఈ తెల్లవారుజామున జనం బయటకు పరుగులు తీశారు. భూ ప్రకంపనలు వణుకు పుట్టించాయి. ఇంట్లో అప్పుడప్పుడే నిద్ర నుంచి లేస్తున్న వారు కొందరు, వాకింగ్ కోసం బయటకు వెళ్లిన వారు మరి కొంతమంది భయభ్రాంతులకు గురయ్యారు. రాష్ట్ర తీరప్రాంతంలో ఈ తెల్లవారుజామున భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బంగాళాఖాతంలో భూకంపం కారణంగా విశాఖ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూమి కొన్ని సెకన్ల పాటు కంపించింది. భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.5గా నమోదైంది. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ నివేదిక ప్రకారం, ఈ తెల్లవారుజామున 5 గంటల 6 గంటల సమయంలో బంగాళాఖాతంలో భూకంపం సంభవించింది.

- 2లో...

## వియత్నాం నుంచి స్వదేశానికి...

- మృతదేహాల తరలింపునకు కేంద్రం ప్రత్యేక చర్యలు
- హనోయి నుంచి హైదరాబాద్‌కు రవాణా ఏర్పాట్లు
- బాధిత కుటుంబాలకు పూర్తి అండగా ప్రభుత్వం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వియత్నాంలో జరిగిన బోటు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు మృతిచెందిన విషయం తెలిసిందే. వారి భౌతికకాయాలను వీలైనంత త్వరగా స్వస్థలాలకు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, ఈ కష్టసమయంలో ఎవరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు.

**వియత్నాం రాజధాని హనోయికి మృతదేహాలు.. :** దివంగత రవితేజ (హిందూపురం), శ్రీధర్ (కడప), జయలక్ష్మి (మచిలీపట్నం)ల భౌతికకాయాలకు సంబంధించి వియత్నాం ప్రభుత్వం, అక్కడి భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) అధికారిక లాంఛనాలను పూర్తి చేస్తున్నాయని కేంద్ర మంత్రి రామ్మోహన్ పేర్కొన్నారు. అన్ని అనుమతులు లభించిన అనంతరం మృతదేహాలు ఈ రాత్రికి వియత్నం రాజధాని హనోయికి చేరుకుంటాయని వివరించారు. మృతులతో పాటు అక్కడ చిక్కుకున్న మిగిలిన తెలుగువారిని కూడా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు తగ్గ ఏర్పాట్లు కూడా పూర్తి చేస్తున్నామని వివరించారు.

- 2లో...

## రాజకీయాల్లో రాద్ధాంతం..

# సిద్ధాంతం కరువు

- పార్టీ మారితే పదవులకు రాజీనామా చేయాలన్న వెంకయ్య
- రాజకీయాల్లో నైతిక విలువలు అవసరమని సూచన
- యువత ప్రజాజీవితంలోకి రావాలని పిలుపు



**విశాఖ(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి లడ్డూ వ్యవహారం, అయోధ్యలో దొంగతనం, శబరిమల ఘటన తననెంతో బాధించాయని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. వీటికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆదివారం విశాఖలో 'వెంకయ్య నాయకుడు' పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించి, వెంకయ్య నాయుడితో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. అనంతరం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రసంగించారు.

ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ..'విశాఖ వచ్చినప్పుడల్లా ఎంతో సంతోషంగా ఉంటుంది. ఇక్కడే నేను చదువుకున్నాను.

మిగతా 2లో...

## రైట్ టైమ్.. రైట్ ప్లేస్.. రైట్ లీడర్ మోదీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ) వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ దిశగా మోదీ చేస్తున్న కృషి ఫలితమిస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ భారత దేశానికి గర్వకారణమని వ్యాఖ్యానించారు. మోదీకి అన్ని దేశాల్లో మంచి గౌరవం లభిస్తోందని తెలిపారు. మోదీ వల్లనే ప్రపంచంలో భారత దేశ కిర్తీ ప్రతిష్ఠలు మరింతగా పెరిగాయని ఉద్ఘాటించారు. రైట్ టైమ్, రైట్ ప్లేస్ రైట్ లీడర్ నరేంద్రమోదీ అని ప్రశంసించారు.

**వియత్నాం ఘటనపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.. :** వియత్నాం బోటు ప్రమాద ఘటనపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏపీ వాసులు పర్యాటకానికి వెళ్లి ప్రమాదం బారిన పడటం దురదృష్టకరమని అన్నారు. వియత్నాం ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలను స్వస్థలాలకు రప్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. మిగిలిన టూరిస్టులను కూడా ఏపీకి తీసుకువచ్చేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## వియత్నాం విషాదంపై సీఎం సమీక్ష

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వియత్నాం పడవ ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రమాదంలో మరణించినవారిని, మిగతా బాధితులను స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రమాదంలో గాయపడిన మచిలీపట్నానికి చెందిన గెల్లి కిశోర్ కు ప్రస్తుతం వియత్నాం ఆస్పత్రిలోనే చికిత్స జరుగుతుండగా.. అందుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదే ప్రమాదంలో అతని భార్య గెల్లి జయశ్రీ (50) మరణించారని తెలిసి దిగ్భ్రాంతి చెందారు. కాగా.. మృతదేహాలను స్వస్థలానికి తరలించేందుకు రాయబార కార్యాలయం ప్రత్యేక ఏజెన్సీని నియమించిందని, మృతదేహాల అప్పగింత, తరలింపు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనట్లు వెల్లడించారు.

ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడిన ఇతర పర్యాటకులను ప్రత్యేక విమానాల ద్వారా తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. బాధితులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలని సీఎం చంద్రబాబు నాయుడు ఏపీ భవన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మృతదేహాల తరలింపు ప్రక్రియ పూర్తయ్యేంతవరకూ సహకరించాలని. దీనిపై వియత్నాంలోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు కో-ఆర్డినేట్ చేసుకోవాలని సీఎం సూచించారు. విహారయాత్ర విషాదంగా మారడంతో గెల్లి జయశ్రీ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. కూతురు, కొడుకు తో పాటు.. బంధువులంతా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర భరోసా ఇచ్చారు.

## పవన్ కల్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉంది

(మొదటి పేజీ తరువాయి)

తగిన విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారని చంద్రబాబు తెలిపారు. అయితే శస్త్రచికిత్స పూర్తికాగానే విధుల్లోకి రావాలనే ఆసక్తిని పవన్ కల్యాణ్ వ్యక్తం చేశారని చెప్పారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, పూర్తిస్థాయిలో కోలుకుంటున్నారని వెల్లడించారు.

ఎడమ భుజంలోనూ సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారని, కుడి భుజం పూర్తిగా కోలుకున్న ఆరు నెలల తర్వాత మరోసారి పరీక్షలు నిర్వహిస్తారని చంద్రబాబు తెలిపారు. అప్పటి పరిస్థితిని బట్టి శస్త్రచికిత్స అవసరమా, లేక ఫిజియోథెరపీతోనే సమస్య పరిష్కారమవుతుందా అన్నది నిర్ణయిస్తారని చెప్పారు. పవన్ కల్యాణ్ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో మునుపటి ఉత్సాహంతో ప్రజాసేవలోకి తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## విశాఖలో భూప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

కాకినాడకు తూర్పు దిక్కున సుమారు 225 కిలోమీటర్ల దూరంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. భూకంప ప్రభావంతో విశాఖలోని వీఎూ, అప్పుఘర్, పెద్దవాల్తేరు, గాజువార, ఆరిలోవ, మంగళపాలెం సహా పలు ప్రాంతాల్లో సూమారు 7 సెకన్ల పాటు భూమి స్వల్పంగా కంపించింది. అయితే భూ ప్రకంపనలతో ఎక్కడా ఎలాంటి నష్టం సంభవించలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బంగాళాఖాతంలో భూకంపం – విశాఖ, కాకినాడ తీర ప్రాంతాల్లో ప్రకంపనలు

తెల్లవారుజామున 5:06 గంటల సమయంలో సుమారు 7 సెకన్ల పాటు కంపించిన భూమి

భూకంపం రాకకు కారణం ఇదే : మనం నివసిస్తున్న భూమి మూడు పొరలుగా ఉంటుంది. పై పొరను భూ పటలం, లోపలి పొర భూ కేంద్రం , ఈ రెండింటి మధ్య పొరను భూ ప్రావారం అంటారు. భూ పటలం మనకు కనిపించే భూమి పై పొర. ఇది ఇది రాళ్లు, నేలలతో కూడి ఉంటుంది. భూ ప్రావారం వేడి, దట్టమైన రాతితో కూడి ఉంటుంది. ఇది ఎక్కువ మందంగా ఉంటుంది. ఇక భూ కేంద్రం ఇది ఇనుము, నికెల్ లోహాలతో ఉంటుంది. భూ పటలంలోని టెక్టోనిక్ ప్లేట్లు నిరంతరం కదులుతూ ఒకదానితో ఒకటి ఢీకొంటాయి. అలా ఢీకొట్టడం వల్ల విడుదలైన శక్తి ఉపరితలంపై ప్రకంపనలు సృష్టిస్తుంది. భూకంపాల రాకకు ఇదే కారణం.

## ఎంఈఓ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓ-1)కు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ మంజూరు చేయాలని ఎంఈఓ-1 అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న దాదాపు 200 మంది ఉపాధ్యాయులకు డీడీవోలుగా వ్యవహరిస్తున్న ఎంఈఓ-1లకు ఇప్పటికీ సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం వల్ల పరిపాలనా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. పరిమిత సంఖ్యలో ఉపాధ్యాయులున్న ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఈ అధికారాలు ఉన్నప్పటికీ, మండల విద్యాశాఖకు అధిపతులుగా ఉన్న గెజిటెడ్ ఎంఈఓ-1లకు ఇవి లేకపోవడం తమ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ అంశాన్ని పలుమార్లు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినప్పటికీ సంబంధిత ఉత్తర్వులు ఇంకా వెలువడలేదని సామల సింహాచలం తెలిపారు. అలాగే కొన్ని జిల్లాల్లో జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా ఎంఈఓ-1లకు అదనపు విధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. ఎంఈఓ-1ల సమస్యలను పరిష్కరించి సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ మంజూరు చేయడంతో పాటు విధుల విషయంలో ఏకరీతి మార్గదర్శకాలు జారీ చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి బుక్కా రవి నాయక్ విద్యాశాఖ మంత్రిని కోరారు.

# హర్మూజ్ మళ్లీ మూత..!

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. సైప్రస్ జెండాతో హర్మూజ్‌లో అనధికార మార్గంలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై తమ సైన్యం కాల్పులు జరిపిందని.. దీంతో జలసంధిని మరోసారి మూసివేస్తునట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ దాడి కారణంగా నౌకలోని సిబ్బంది ఒకరు మృతి చెందినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. ఇరాన్ ఓ తప్పుడు నిర్ణయం తీసుకుందని.. దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుందని అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ హెచ్చరించారు. దీంతో టెహ్రాన్‌పై అమెరికా దాడులు కొనసాగించే అవకాశం ఉందని పశ్చిమాసియా దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**ఇరాన్‌పై అమెరికా దాడులు..:** హర్మూజ్ తీరంలోని రెండు పట్టణాలపై అమెరికా విరుచుకుపడంతో 10 చోట్ల భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ వెల్లడించింది. కాగా టెహ్రాన్‌పై మూడో విడత దాడులు పూర్తి చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. మొత్తం 140 టార్గెట్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. బుషెహర్ ప్రావిన్స్‌పై జరిపిన దాడుల్లో ఒక సైనిక స్థావరంతో సహా పలు ప్రాంతాలు దెబ్బతిన్నట్లు సమాచారం. తాజా దాడులతో ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయని ప్రభుత్వ మీడియా వర్గాలు వెల్లడించాయి.

**కువైట్..బహ్రెయిన్‌లపై ప్రతీకార దాడులు.. :** టెహ్రాన్‌పై దాడులకు ప్రతీకారంగా కువైట్.. బహ్రెయిన్, ఖతార్‌లలోని అమెరికా సైనిక



స్థావరాలపై డ్రోన్ దాడులు చేపట్టినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. కువైట్.. బహ్రెయిన్‌లలోని యూఎస్ వైమానిక రక్షణ వ్యవస్థలు, ఆయుధ డిపో, రాడార్ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ దాడులతో బహ్రెయిన్ అంతటా సైరన్‌లు మోగుతున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. దోహాలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపిస్తుండడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ప్రాంతీయ ఉద్రిక్తల నేపథ్యంలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేస్తున్నట్లు గల్ఫ్ దేశాలు ప్రకటించాయి. క్షిపణి ముప్పును ఎదుర్కోవడానికి తమ గగనతల రక్షణ వ్యవస్థలు చురుగ్గా ప్రతిస్పందిస్తున్నాయని యూఏఈ వెల్లడించింది.

**అమెరికా యుద్ధ విమానాల నిర్వహణ కేంద్రంపైకి క్షిపణులు.. :** ఖతార్‌లోని అల్ ఉదైద్ వైమానిక స్థావరంపై క్షిపణి దాడులు చేసినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఆ స్థావరంలోని యుద్ధ విమానాల నిర్వహణ కేంద్రం కమాండ్-అండ్-కంట్రోల్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసినట్లు పేర్కొంది. జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్ బేస్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపైనా క్షిపణులు ప్రయోగించినట్లు తెలిపింది. ఆ బేస్‌లోని కమాండ్-అండ్-కంట్రోల్ సెంటర్‌తో పాటు ఎంక్యూ-9 డ్రోన్‌లు ఉన్న హ్యాంగర్లను నాశనం చేశామంది. అయితే ఘటనలపై అమెరికా.. ఖతార్ అధికారుల నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు.

**దుఖ్మ్ ఓడరేవు లక్ష్యంగా దాడులు .. :** ఒమన్‌లోని దుఖ్మ్ ఓడరేవుపై ఇరాన్ భారీ దాడులు చేసింది. ఈ దాడుల్లో అమెరికా విమాన వాహక నౌకలు ఉపయోగించే లాజిస్టిక్స్ సహాయ కేంద్రాలు, ఇంధనం నింపే కేంద్రాలు ధ్వంసమయ్యాయి. అమెరికా బాంబు దాడులకు స్పందనగా ఒమన్‌పై మూడో దశ దాడులు ప్రారంభించినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. కాగా దుఖ్మ్ భారత్‌కు కీలకమైన ఓడరేవు. ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున చమురు సరఫరా అవుతుంది.

**ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసింది: మహమ్మద్ ఘాలిబాఫ్**

ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసిందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. మాట నిలబెట్టుకోవాలని.. లేదంటే మూల్యం చెల్లించడానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఇక అమెరికాతో ఒప్పందంలోని అయిదో పాయింట్‌ను ఫొటోను ఆయన తన ఎక్స్ పోస్టుకు జత చేశారు.

# ఆటోనగర్‌లో అగ్నికీలలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎగిరిపడి మంటలు చెలరేగాయి.

పక్క బస్సులకు వ్యాపించిన మంటలు : మొదట ఒక బస్సులో మొదలైన మంటలు వెంటనే పక్కనున్న బస్సులకు వ్యాపించాయి. ఉదయం 11.20 గంటల సమయంలో ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించాయి. ఆ ప్రాంతమంతా నల్లటి పొగతో నిండిపోయింది. పక్కనే మరికొన్ని బస్సులు పార్కింగ్ చేసి ఉండటంతో మంటలు మరింత వేగంగా వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు.

సాహసం చేసిన స్థానికులు : ప్రమాద సమయంలో షెడ్డు నిండా బస్సులు ఉన్నాయి. అవి ఏవీ కూడా స్టార్టింగ్ కండిషన్‌లో లేవు. మంటలు మరింతగా వ్యాపించకుండా స్థానికులు సాహసం చేశారు. క్రేన్ల సహాయంతో బస్సులను పక్కకు లాగే ప్రయత్నం చేశారు. తమ ప్రాణాలకు తెగించి సుమారు 10 బస్సుల వరకు సురక్షితంగా బయటకు తీశారు. దీంతో మరింత భారీ నష్టం తప్పింది.



రంగంలోకి అగ్నిమాపక సిబ్బంది : సమాచారం అందుకున్న వెంటనే ఆటోనగర్, గవర్నర్ పేట, కొత్తపేట ప్రాంతాల నుంచి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైరింజన్లతో మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు.

బస్సుల్లో ఫైబర్, రబ్బరు టైర్లు ఎక్కువగా ఉండటంతో మంటలు పదే పదే చెలరేగాయి. సిబ్బంది శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో మొత్తం ఏడు ప్రైవేటు బస్సులు కాలి బూడిదయ్యాయి. లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లింది. అయితే, అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆరా తీస్తున్నారు.

# బుల్లెట్ స్పీడ్‌లో అమరావతి

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** బుల్లెట్ రైలులో హైదరాబాద్ నుంచి అమరావతికి 70 నిమిషాల్లోనే చేరుకోవచ్చని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. బెంగళూరుకు 2.35 గంటలు, పుణెకు 123 నిమిషాలు, చెన్నైకు 3 గంటల్లో చేరుకోవచన్నారు. దేశీయంగా సాంకేతిక రంగం సరికొత్త ఆవిష్కరణలతో దూసుకుపోతోందని, వికసిత భారత్-2047 స్వప్నాన్ని సాకారం చేయడంలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఐటీ, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, రైల్వే రంగాలు విప్లవాత్మక పురోగతి సాధిస్తున్నాయని పేర్కొన్నారు.

శనివారం హైదరాబాద్‌లో 'వికసిత్ భారత్-2047- సాంకేతికత పాత్ర' అంశంపై ఐటీ పరిశ్రమ వర్గాలతో మంత్రులు ప్రత్యేకంగా భేటీ అ-య్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అశ్విని వైష్ణవ్ మాట్లాడారు. 'ముంబయి-అహ్మదాబాద్ మధ్య మొదటి బుల్లెట్ రైలు ప్రాజెక్టు నిర్మాణం అత్యంత వేగంగా సాగుతోంది. ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా మరో 7 బుల్లెట్ రైలు కారిడార్లను మంజూరు చేశారు. ఇందులో 3 హైదరాబాద్ దక్కించుకుంది.

హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణె నగరాలకు బుల్లెట్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. హైదరాబాద్ నుంచి అమరావతికి 70 నిమిషాలు, బెంగళూరుకు 2.35 గంటలు, పుణెకు 123 నిమిషాలు, చెన్నైకు 3 గంటల్లోనే చేరుకోవచ్చు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్‌లో రూ. 880 కోట్లు దక్కాయి' అని వివరించారు.




అమరావతి మీదుగానే హైస్పీడ్ రైల్ కారిడార్ : బుల్లెట్ రైళ్లు పరుగులు పెట్టేందుకు నిర్మించనున్న హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ రాజధాని అమరావతి మీదుగానే వెళ్లనుంది. అమరావతికి కొంత దూరంలో రావెల వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించనుండగా దానికి ఆనుకొని హైస్పీడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్ ఉండాలని కొంతకాలం క్రితం సీఎం చంద్రబాబు సూచించారు. ఈ మేరకు ఫైనల్ లొకేషన్ సర్వే, డీపీఆర్ తయారీకి నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ సిద్ధమైంది.

అయితే విమానాశ్రయానికి ఆనుకొని ఎలైన్‌మెంట్ ఖరారు చేస్తే ఆ కారిడార్ రాజధాని నగరానికి, విజయవాడకు దూరమైపోతుంది. విమానాశ్రయం సమీపం నుంచి గుంటూరు వైపు వెళ్లాల్సి ఉంటుందని గుర్తించారు. దీంతో రాజధాని నగరానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో మొదట నిర్దేశించినట్లు అమరావతి మీదుగానే కారిడార్ వెళ్లేలా ఫైనల్ లొకేషన్ సర్వే, డీపీఆర్ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సూచించింది. 760.09 కిలోమీటర్లు, 18 స్టేషన్లు: హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్ తెలంగాణ, ఏపీ, తమిళనాడుల్లో కలిపి మొత్తం 760.09 కిలోమీటర్లు ఉంటుంది. 18 స్టేషన్లు నిర్మిస్తారు. తెలంగాణలో 180.32 కిలోమీటర్లు కాగా, హైదరాబాద్, శంషాబాద్, భారత్ సిటీ, డ్రైపోర్ట్, హాలియా, వాడపల్లి వద్ద స్టేషన్లు నిర్మిస్తారు. ఏపీలో 518.54 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. ఇందులో దాచేపల్లి మొదటి స్టేషన్ అవుతుంది. ఆ తర్వాత అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి స్టేషన్లు నిర్మిస్తారు.

## వియత్నాం పడవ ప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కొల్లు రవీంద్ర


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందిన గెల్లి జయశ్రీ కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం విజయవాడలో పరామర్శించారు. మొగల్రాజపురంలోని గెల్లి కిషోర్ నివాసానికి వెళ్లిన మంత్రి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడిన గెల్లి కిషోర్‌కు వియత్నాంలో మెరుగైన వైద్యం అందుతోందని, ఆయన ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



వియత్నాంలో కిషోర్‌కు తోడుగా ఉన్న కుటుంబ సభ్యులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి, అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జయశ్రీ భౌతికకాయం సోమవారం సాయంత్రానికి విజయవాడకు చేరుకుని, మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించే అవకాశం ఉందని అధికారులు తెలిపినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చిన మంత్రి, ఘటనపై ఇప్పటికే మంత్రి నారా లోకేశ్ భారత రాయబార కార్యాలయంతో సమన్వయం జరిపారని, అవసరమైన అన్ని సహాయ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## రాజధాని నిర్వాసితులకు రెట్టింపు భరోసా

(మొదటి పేజీ తరువాయి)



**డెట్ వేవర్ స్కీమ్‌కు ఆమోదం :** గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఏడు గ్రామాల్లో డెట్ వేవర్ స్కీమ్‌కు ఏపీ సర్కార్ ఆమోదం తెలిపింది. ఏపీసీఆర్డీఏ కమిషనర్‌కు రుణమాఫీ అమలు చేసే అధికారాలను ఏపీ సర్కార్ కల్పించింది. ల్యాండ్ పూలింగ్ పరిధిలోని రైతుల వ్యవసాయ రుణాల మాఫీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రుణమాఫీ అమలుకు ప్రత్యేక కార్యాచరణ మార్గదర్శకాలను ఏపీసీఆర్డీఏ రూపొందించనుంది. 06-01-2026 నాటికి ఉన్న వ్యవసాయ రుణాలకే అర్హత కల్పించాలని స్పష్టం చేసింది. ఏపీసీఆర్డీఏ చట్టం సెక్షన్ 55(4) తొలి నోటిఫికేషన్ తేదీనే కట్-ఆఫ్‌గా నిర్ణయం తీసుకుంది. తాజాగా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్-148ను ఏపీ సర్కార్ జారీ చేసింది.

**రూ.1,122.86 కోట్ల ప్రాజెక్టులకు ఏపీ సర్కార్ ఆమోదం.. :** పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 1,122.86 కోట్ల ప్రాజెక్టులకు ఏపీ సర్కార్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ బాండ్ల ద్వారా రూ. 1,010.58 కోట్లను సమీకరించనుంది. పూల్డ్ మున్సిపల్ బాండ్ ఇష్యూ ఫ్రేమ్‌వర్క్‌కు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. పట్టణాభివృద్ధి నిధుల సమీకరణకు మార్కెట్ ఆధారిత విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్రాఖ ఖూమీను పూల్డ్ మున్సిపల్ బాండ్ కార్యక్రమానికి ప్రోగ్రామ్ మేనేజర్‌గా నియమించింది. మర్చంట్ బ్యాంకర్ ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. బాండ్ జారీకి ముందు పాల్గొనే పట్టణ స్థానిక సంస్థలకు క్రెడిట్ రేటింగ్ తప్పనిసరని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ లేకుండానే బాండ్ జారీ ప్రక్రియ చేయాలని నిర్ణయించింది. బాండ్ రుణాల చెల్లింపు బాధ్యత పూర్తిగా సంబంధిత పట్టణ స్థానిక సంస్థలదేనని తేల్చిచెప్పింది. ఈ క్రమంలోనే పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయ నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ మేరకు ఏపీ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.

## వియత్నాం నుంచి స్వదేశానికి...

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్ విమానాశ్రయానికి తరలించేందుకు ఏర్పాట్లు.. :** సోమవారం (జులై 13) నాటికి భారత ఎంబసీ అధికారులు ఎయిర్‌లైన్స్, డాక్యుమెంటేషన్ ప్రక్రియలను పూర్తి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి రామ్మోహన్ తెలిపారు. అనంతరం భౌతికకాయాలను హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తారని పేర్కొన్నారు. విమాన ప్రయాణ షెడ్యూల్ ఖరారుతో పాటు స్వదేశానికి తరలింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు విదేశాంగ శాఖ, పౌర విమానయాన శాఖ, భారత రాయబార కార్యాలయం నిరంతరం సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

**'ఈ-కేర్' పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలి.. :** హైదరాబాద్ విమానాశ్రయంలో భౌతికకాయాలను అప్పగించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వ 'ఈ-కేర్' పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ స్పష్టం చేశారు. ఈ మేరకు మృతుల కుటుంబ సభ్యులు భౌతికకాయాన్ని స్వీకరించే వ్యక్తి పేరు, మొబైల్ నంబర్, ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఫొటో ఐడీ) వివరాలను అత్యవసరంగా అందించాలని కోరారు. ఈ వివరాలను ఆంధ్రప్రదేశ్ భవన్ బృందం వెంటనే వియత్నాంలోని భారత ఎంబసీకి పంపి, తదుపరి ఏర్పాట్లను పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ అంశంపై ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులకు ఉపశమనం కలిగేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఏపీ భవన్, ఎంబసీ అధికారులతో నిత్యం సీఎంవో సంప్రదింపులు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.


## రాజకీయాల్లో రాద్ధాంతం.. సిద్ధాంతం కరువు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నగరం నాకు మంచి స్నేహితులను ఇచ్చింది. విశాఖలోనే విద్యార్థి నాయకుడిగా ఎదిగాను. అన్ని పదవుల కంటే బీజేపీ అఖిల భారత అధ్యక్షుడు కావడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. నా 48వ ఏట బీజేపీ అధ్యక్షుడు అయ్యే అవకాశం వచ్చింది. కానీ, అప్పుడు మా కుటుంబ సభ్యులతో చర్చిస్తే వద్దు అన్నారు. వాజ్‌పేయి, అద్వానీ వంటి వారితో పని చేయడం అదృష్టం. నేను ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడు కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణ రద్దయ్యింది. నా జీవితంలో ఇది మంచి ఘట్టంగా భావిస్తాను. యువత రాజకీయాల్లోకి రావాలి. నా వయసు 77 సంవత్సరాలు. ఇక ఎంతకాలం ఉంటానో తెలియదు.

యువతకు ఎన్నో విషయాలు చెప్పడానికి తిరుగుతూనే ఉంటాను. నేను తిరుగుతూనే పోవాలనేది నా కోరిక. నేటి రాజకీయాల్లో రాద్ధాంతం తప్ప సిద్ధాంతం లేదు. కొంతమంది నిన్న ఏం మాట్లాడారో, ఈరోజు ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదు. రాజకీయ నాయకులు నైతిక విలువలు పాటించాలి. ఎవరైనా సరే పదవులకు రాజీనామా చేసి మాత్రమే పార్టీలు మారాలి. దీనిపై చర్చ జరగాలి. ఏపీలో కొంతమంది బూతులు మాట్లాడుతున్నారు. అలాంటి వారికి ఎన్నికల బూత్‌లోనే ఓటర్లు బుద్ధి చెప్పారు. నేను ఎవరినీ, ఏ రాజకీయ పార్టీనీ విమర్శించడం లేదు. నేను బీజేపీలో లేను. కానీ మనసంతా ఆ పార్టీపైనే ఉంది. మా తాత, అమ్మమ్మ కారణంగానే ఈ స్థాయికి చేరుకున్నా. నాకు చిన్నప్పుడు దూకుడు ఎక్కువ. తెన్నేటి విశ్వనాథం పరిచయంతో దూకుడు తగ్గింది' అని తెలిపారు.

## హరిత విప్లవానికి శ్రీకారం



(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఆయనామీూ బస్సులను కూడా జెండా ఊపి ప్రారంభించారు.

**ప్రజల భాగస్వామ్యం కోసం ప్రత్యేక యాప్ :** ఈ పర్యావరణ ఉద్యమంలో సాధారణ ప్రజలను కూడా భాగస్వాములను చేయడానికిూవీజ సరికొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. AMC Seva మొబైల్ అప్లికేషన్ ద్వారా 'గ్రీన్ వాలంటీర్', 'మెమోరియల్ పార్క్' వంటి వినూత్న కార్యక్రమాలను ప్రమోట్ చేస్తున్నారు.

**ఇళ్ల వద్దే ఉచితంగా మొక్కలు నాటే సదుపాయం:** నివాస ప్రాంతాలను 'గ్రీన్ సొసైటీలు'గా మార్చడానికి ఒక ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించారు. తమ ఇళ్లలో లేదా సొసైటీ ఆవరణలో మొక్కలు నాటాలనుకునే పౌరులు AMC Seva యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. అలా రిజిస్టర్ చేసుకున్న వారి ఇళ్లకు అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బృందాలు స్వయంగా వచ్చి ఉచితంగా మొక్కలు నాటుతాయని గుజరాత్ ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.

# పద్మశాలీలు మరిన్ని అవార్డులు సాధించాలి




తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ) :పద్మశాలి సంఘీయులు వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ మరిన్ని పురస్కారాలు అందుకోవాలని రాష్ట్ర పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జీవీ శివరామకృష్ణ ఆకాంక్షించారు. తెనాలి రామలింగేశ్వరపేటలోని సంఘ కార్యాలయంలో పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వెలగా వెంకటప్పయ్య స్మారక అవార్డు గ్రహీత, తెనాలి మానవత సంస్థ నూతన అధ్యక్షుడు కటకం వెంకట ప్రసాద్‌తో పాటు ఉద్యోగ విరమణ చేసిన పట్టెం శ్రీలక్ష్మి, మాచర్ల లీలా శ్రీనివాసమూర్తి, ఆకురాతి హరివర ప్రసాద్‌లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ శాఖ అధ్యక్షుడు తిరువీధుల నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా జీవీ శివరామకృష్ణ, మాచర్ల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జీవీ శివరామకృష్ణ మాట్లాడుతూ కటకం వెంకట ప్రసాద్ చిన్ననాటి కష్టాలను అధిగమించి ఓంకార్ గ్రాఫిక్స్ ద్వారా గుర్తింపు పొందడమే కాకుండా మానవత సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో విశిష్ట స్థానం సంపాదించారని కొనియాడారు. ఉపాధ్యాయులుగా మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన పట్టెం శ్రీలక్ష్మి, మాచర్ల లీలా శ్రీనివాసమూర్తి, ఆకురాతి హరివర ప్రసాద్ సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం సన్మాన గ్రహీతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిట్రా వెంకట సుబ్బారావు, అందె బాలచంద్రమౌళి, కౌతరపు శ్రీనివాసరావు, పడవల శివయ్య, అవ్వారు అనురాధతో పాటు సంఘ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

# యువ రైతులను వ్యవసాయానికి ప్రోత్సహించాలి



- బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు, జూలై 11: గుంటూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జిల్లా కిసాన్ మోర్చా సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు ముఖ్య అతిథులుగా హాజరై కిసాన్ మోర్చా నాయకులకు సంస్థాగత బలోపేతం, రైతు సంక్షేమ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా చిగురుపాటి కుమారస్వామి మాట్లాడుతూ యువ రైతులను వ్యవసాయ రంగం వైపు ఆకర్షించేలా కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పథకాల ప్రయోజనాలు ప్రతి రైతుకు చేరేలా కిసాన్ మోర్చా నాయకులు సమన్వయంతో పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విబిజి రాంజీ పథకం విశిష్టతను రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకురాలు ఎడ్లపాటి స్వరూపరాణి, రాష్ట్ర పసుపు సెల్ కన్వీనర్ కొంగర జోగేంద్ర ప్రసాద్, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు ఆదా సీతారామయ్యతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమానికి పునాది వేసిన నేత ఎన్టీఆర్



- మంత్రి ఎన్ఎండీ ఫరూక్

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ) : మైనారిటీల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి పునాది వేసిన నాయకుడు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని రాష్ట్ర మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. విజయవాడ ఇస్లాంపేటలోని షాజహూర్ మూసాఫిర్ ఖానాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను శనివారం ప్రారంభించిన ఆయన, మైనారిటీల సంక్షేమం కోసం 1985లో ఎన్టీఆర్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి శిక్షణ, స్వయం ఉపాధి, రుణాలు, ఉద్యోగ కల్పన వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటేనే యువత ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోగలదని ఆయన సూచించారు.

కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి దేశంలోనే ప్రత్యేకంగా నిలిచే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేస్తోందని మంత్రి తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా దేశీయంగానే కాక విదేశాల్లోనూ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంటూ, జర్మన్, చైనీస్ వంటి విదేశీ భాషల్లో ప్రావీణ్యం సాధించాలని యువతకు సూచించారు. ఈ జాబ్ మేళాలో దాదాపు 70 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొని అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయగా, మంత్రి ఫరూక్ వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ మౌలానా, ఎండీ యాకుబ్ భాష, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్, డైరెక్టర్ మనియార్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యం

- రాజధానిని అడ్డుకునేందుకు అరశాతం మంది రైతులను అడ్డం పెట్టుకుని రాజకీయం
- సీడ్ యాక్సెస్ రోడ్డుపై వైసీపీ దుష్ప్రచారం
- రాజధానికి కనెక్టివిటీ రాకుండా వైసీపీ కుట్రలు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : అమరావతి రాజధాని అభివృద్ధిని అడ్డుకోవడానికి వైఎస్సార్‌సీపీ నిరంతరం కుట్రలు చేస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆరోపించారు. రాజధాని అభివృద్ధికి 99.50 శాతం మంది రైతులు భూములు స్వచ్ఛందంగా ఇచ్చినప్పటికీ, మిగిలిన కొద్ది మంది రైతులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయాలన్నదే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, 2019–24 మధ్య అమరావతిని నిర్వీర్యం చేసి మూడు రాజధానుల పేరుతో అభివృద్ధిని అడ్డుకుందని అన్నారు. ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పినా అమరావతిపై దుష్ప్రచారం మాత్రం ఆపడం లేదని మండిపడ్డారు.

అమరావతికి అనుసంధానంగా నిర్మిస్తున్న ఈ–3 సీడ్ యాక్సెస్ రోడ్ కోసం కేవలం 2.725 ఎకరాల భూసేకరణ అంశాన్ని వైఎస్సార్‌సీపీ రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆనందబాబు పేర్కొన్నారు. భూసేకరణకు ముందు అధికారులు పలుమార్లు రైతులతో సమావేశాలు నిర్వహించి, ల్యాండ్ పూలింగ్‌కు అవకాశం కల్పిస్తూ వారిని ఒప్పించే ప్రయత్నం చేశారని చెప్పారు. కోర్టు విచారణలు కొనసాగుతున్న సమయంలో కూడా రైతులకు భూ సమీకరణలో చేరే అవకాశాన్ని కల్పించారని, ఈ ప్రక్రియలో పలువురు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని తెలిపారు. ఉండవల్లి ప్రాంతంలో ప్రతిపాదించిన భూసేకరణలో కూడా గణనీయమైన భూమి ల్యాండ్ పూలింగ్ ద్వారా సమకూరిందని వివరించారు.

మిగిలిన 2.725 ఎకరాలకు మాత్రమే తప్పనిసరి పరిస్థితుల్లో భూసేకరణ చేపట్టాల్సి వచ్చిందని, దీనికి సంబంధించి 11 మంది రైతులకు భూములు, నిర్మాణాలు, పంటలకు కలిపి రూ.7.14 కోట్ల పరిహారం మంజూరు చేసినట్లు చెప్పారు. రైతులు చెక్కులు స్వీకరించకపోవడంతో నిబంధనల ప్రకారం ట్రిబ్యునల్‌లో జమ చేశామని వెల్లడించారు. ఒకవైపు రాజధానికి కనెక్టివిటీ రాకుండా అడ్డుపడుతూ, మరోవైపు అమరావతికి అనుసంధానం లేదని విమర్శించడం వైఎస్సార్‌సీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని నక్కా ఆనందబాబు విమర్శించారు.

# దళితుల పేరుతో రాజకీయ కుట్రలు సహించం

- హిందూ సమాజంలో విభేదాలు రేపే కుట్రలను అడ్డుకుంటాం
- దళితుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలను తిప్పికొట్టాలి
  బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ) : రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం దళిత సంక్షేమం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఎస్సీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అన్నారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన "సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్" స్ఫూర్తితో సమాజంలోని చివరి వ్యక్తికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దళితులపై ఎలాంటి అన్యాయం జరిగినా బీజేపీ ఎస్సీ మోర్చా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో అభివృద్ధిని జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దళితులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హిందూ సమాజంలో విభేదాలు సృష్టించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. హిందూ దేవాలయాలు, హిందూ విశ్వాసాలపై జరుగుతున్న వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. జడా శ్రవణ్, ప్రకాష్ రాజ్‌లపై ఉపా చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ, కొందరు వ్యక్తులు వరుసగా చేసిన వ్యాఖ్యలకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకే ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం సమగ్ర దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా దళిత నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి దళిత సమాజానికి సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లూరి గంగాధర్, కంతేటి బ్రహ్మయ్య, జోనల్ ఇన్‌చార్జి మేకల లక్ష్మణ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సర్వశుద్ధి రాజుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# 2027 పుష్కరాల నాటికి తీపర్రును ఆదర్శ పుష్కర గ్రామంగా తీర్చిదిద్దుతాం

- మంత్రి కందుల దుర్గేష్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) : 2027 గోదావరి పుష్కరాల నాటికి నిడదవోలు నియోజకవర్గంలోని పెరవలి మండలం తీపర్రు గ్రామాన్ని ఆదర్శ పుష్కర గ్రామంగా, స్థానిక ఘాట్‌ను మోడల్ ఘాట్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. శనివారం తదేకం ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన 'మా గోదావరి సంకల్ప్' కార్యక్రమాన్ని గోదావరి హారతితో ప్రారంభించిన మంత్రి, ఘాట్‌ను స్వయంగా శుభ్రం చేసి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. తీపర్రు మోడల్ విలేజ్ పనులను వచ్చే సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దళితవాడలో డ్రైనేజీ సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పుష్కరాల దృష్ట్యా విజ్జేశ్వరం–సిద్ధాంతం మధ్య 36 కిలోమీటర్ల ఏటిగట్టును బలోపేతం చేసి రహదారి అభివృద్ధికి రూ.96 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు మంత్రి తెలిపారు. తీపర్రుకు మరో ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి రూ.1.80 కోట్ల ప్రతిపాదనలు పంపగా సర్వే పూర్తయిందన్నారు. అలాగే తీపర్రు ఘాట్ వద్ద గోదావరి తల్లి విగ్రహం ఏర్పాటు, చింతాలమ్మ చెరువు పునరుద్ధరణ, ఘాట్ సుందరీకరణతో పాటు భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

గతంలో గోదావరి పుష్కరాలు రాజమహేంద్రవరానికి మాత్రమే పరిమితమయ్యేవని, ఇకపై తీపర్రు, ముక్కామల, కొవ్వూరు గోష్పాద ఘాట్, పెండ్యాల తదితర ఘాట్లను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. భక్తుల కోసం ద్వారకా తిరుమల, వాడపల్లి, కోటసత్తెమ్మ ఆలయం, గోలింగేశ్వరస్వామి ఆలయం తదితర పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ ప్రత్యేక టూరిస్ట్ సర్క్యూట్‌లు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహిత పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, భక్తుల సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ, మత్స్యకారుల జీవనోపాధికి సమాన ప్రాధాన్యం ఇస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు.

# దేశ వైద్య సాంకేతిక రంగంలో ముందడుగు




విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ) : విశాఖపట్నం వేదికగా దేశ వైద్య సాంకేతిక రంగంలో ఒక చారిత్రాత్మక ముందడుగు పడింది. మేకిన్ ఇండియా స్ఫూర్తితో విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ (ఆమ్టీ)లో అత్యాధునిక కార్డియాక్ కాథెటరైజేషన్ ల్యాబొరేటరీ (క్యాథ్‌ల్యాబ్) పరికరాల తయారీ షురూ కానుంది. ప్రముఖ వైద్య పరికరాల సంస్థ 'ఇన్నోవల్యూషన్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్' కు జాతీయ ఔషధాల నాణ్యత, నియంత్రణ సంస్థ (జఔనాజా) నుంచి అధికారికంగా లైసెన్స్ లభించింది. ఇటీవల కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ ప్రతిష్ఠాత్మక కేంద్రాన్ని ప్రారంభించారు.

అందుబాటు ధరల్లో గుండె చికిత్స: ప్రస్తుతం భారతదేశం అంతటా కేవలం 4 వేల క్యాథ్‌ల్యాబ్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా కార్డియాక్ ఇమేజింగ్ వంటి అధునాతన గుండె చికిత్సలు కేవలం పెద్ద నగరాలకే పరిమితమవుతున్నాయి. ఈ కొరతను అధిగమించేందుకు ఐహెచ్‌పీఎల్ సంస్థ ఇక్కడ అత్యాధునిక కార్డియాక్ ఇమేజింగ్ సిస్టమ్‌లను స్వదేశీ సాంకేతికతతో తయారు చేయనుంది. స్థానికంగానే ఉత్పత్తి జరగడం వల్ల ఆసుపత్రులకు ఈ పరికరాలు తక్కువ ధరలకే లభిస్తాయి. ఇది సామాన్యుడికి సైతం గుండె వైద్య చికిత్సను మరింత చేరువ చేయనుంది.

పారిశ్రామిక అభివృద్ధి మాత్రమే కాదు: మెడ్‌టెక్ జోన్ సాధించిన ఈ అరుదైన మైలురాయిపై సీఈవో, ఎండీ జితేంద్రశర్మ తీవ్ర హర్షం వ్యక్తంచేశారు. దేశీయ మెడ్‌టెక్ ఎకోసిస్టం పటిష్ఠమైన ఎదుగుదలకు ఈ అనుమతి ఒక నిదర్శనమని ఆయన కొనియాడారు. ఐహెచ్‌పీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ అగర్వాల్ మాట్లాడుతూ ఈ లైసెన్స్ తమ సంస్థ ప్రయాణంలో అత్యంత కీలకమైన ఘట్టమన్నారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక అభివృద్ధి మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలను కాపాడే గుండె చికిత్సలను వేగంగా అందుబాటులోకి తీసుకురావడమని అభిప్రాయపడ్డారు.

మెడ్‌టెక్ జోన్‌కు ప్రతిష్ఠాత్మక గుర్తింపు: విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ దేశ వైద్య సాంకేతిక రంగంలో మరో కీలక అడుగు వేసింది. వైద్య పరికరాల తయారీకి అవసరమైన అంతర్జాతీయ స్థాయి నిపుణులను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి దీనికి అరుదైన గౌరవం దక్కింది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని 'నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్' విశాఖ మెడ్‌టెక్ జోన్‌కు 'బయోమెడికల్ స్కిల్ అవార్డింగ్ బాడీ'గా అధికారిక గుర్తింపునిచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇరుసంస్థల మధ్య కీలక ఒప్పందం కుదిరింది.

సర్టిఫికెట్లు జారీ చేసే అధికారం: ఈ సరికొత్త గుర్తింపుతో మెడ్‌టెక్ జోన్ క్యాంపస్‌లో లేదా దాని పర్యవేక్షణలో నడిచే శిక్షణ పొందిన అభ్యర్థులకు మూల్యాంకనం చేసి ఎన్ఎస్‌క్యూఎఫ్ ప్రమాణాలతో కూడిన ధ్రువపత్రాలు జారీ చేసే అధికారం లభించింది.

కొత్త కోర్సుకు గ్రీన్ సిగ్నల్: వైద్య పరికరాల తయారీ రంగంలో మారుతున్న సాంకేతికత, శ్రామిక శక్తి అవసరాలకు అనుగుణంగా మెడ్‌టెక్ జోన్ ఒక ప్రత్యేక కోర్సును డిజైన్ చేసింది. ఏఎంటీజెడ్ రూపొందించిన ఈ ప్రొడక్షన్ అసోసియేట్ మాన్యుఫ్యాక్చరింగ్ (మెడికల్ డివైజ్) ఎన్ఎస్‌క్యూఎఫ్ లెవెల్ 4.5 కోర్సుకు ఎన్‌సీవీఈటీ అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ సరికొత్త శిక్షణా కార్యక్రమాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలతో పాటు దేశీయ వైద్య పరికరాల రంగానికి భారీగా ఊతం లభించనుంది.

# పవన్ కళ్యాణ్ శస్త్రచికిత్స విజయవంతం కావడం ఆనందదాయకం



- త్వరగా కోలుకుని ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్ష : : మంత్రి కందుల దుర్గేష్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ముంబయిలో నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల సూచన మేరకు కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోనున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆయన త్వరగా పూర్తిస్థాయి ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

పవన్ కళ్యాణ్ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమించే అచంచలమైన ప్రజా నాయకుడని మంత్రి కొనియాడారు. శారీరక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, అభిమానుల ప్రార్థనలతో పవన్ కళ్యాణ్ త్వరలోనే రెట్టింపు ఉత్సాహంతో విధుల్లోకి చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర కొనసాగాలని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో నిమగ్నం కావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

# చుండూరులో వంగవీటి మోహన రంగా విగ్రహ ప్రతిష్ఠ



- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు

చుండూరు (జర్నలిస్ట్ ఫైల్ ) :బాపట్ల జిల్లా చుండూరు గ్రామంలోని ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో దివంగత వంగవీటి మోహన రంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన నాయకుడిగా వంగవీటి మోహన రంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

అనంతరం వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశాకిరణ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు ఆమెను కలిసి అభినందించారు.

కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు ఆమంచి స్వాములు, అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వశిష్ఠపై వారధికి ముందడుగు



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా తీరప్రాంత వాసుల చిరకాల కోరిక తీరనుంది. సఖినేటిపల్లి–నరసాపురం వంతెన నిర్మాణానికి ముందడుగు పడింది. దశాబ్దాల ఎదురు చూపులు ఫలించనున్నాయి. సఖినేటిపల్లి–నరసాపురం వశిష్ఠ గోదావరి రేవులోని పంటుపై ప్రతిరోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. వరదల కారణంగా పంటు ఆగిపోతే ఇబ్బందులు పడాల్సిందే. దీంతో ఇక్కడ వారధి నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు.

ఈ క్రమంలోనే నరసాపురం – సఖినేటిపల్లి మధ్య వశిష్ఠ గోదావరిపై వంతెన నిర్మాణానికి గతంలో పలువురు ముఖ్యమంత్రులు భూమిపూజ చేసినా పనులు ప్రారంభం కాలేదు. వైఎస్సార్సీపీ పాలనలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామేశ్వరం– నరసాపురం గ్రామీణ మండలం రాజుల్లంక మధ్య వంతెన నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటి సీఎం వైఎస్ జగన్ వంతెన నిర్మాణానికి నరసాపురం సభలో బటన్ నొక్కారు. కానీ పలు కారణాలతో పనులు ప్రారంభం కాలేదు.

వంతెన నిర్మాణానికి పలు పర్యాయాలు భూమిపూజలు, టెండర్లు పిలిచినా సాంకేతిక కారణాలు, నాయకుల్లో చిత్తశుద్ధి లోపంతో వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోగా రాగానే దీనిపై శ్రద్ధపెట్టింది. తీరప్రాత ప్రజల వాంఛ తీర్చాలని భావించింది. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం రూ. 580 కోట్లు మంజూరు చేసింది. అయినా పలు కారణాలతో పనులు ముందుకు పడలేదు.

ఇటీవలే ఆ అడ్డంకులు తొలగిపోవడంతో వశిష్ఠ గోదావరిపై వారధి నిర్మాణానికి ముందడుగు పడింది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. సుమారు రూ.580 కోట్లతో చేపట్టనున్న వంతెన అనుసంధాన రహదారుల నిర్మాణ పనులకు ఇటీవల టెండర్లు పిలిచారు. నలుగురు గుత్తేదారులు టెండర్లు దాఖలు చేశారు. వారు సమర్పించిన పత్రాల పరిశీలన ఢిల్లీలో కొనసాగుతోందని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ డీఈ ఎన్.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

# జాతీయ నులిపురుగుల దినోత్సవానికి ముందుగా అవగాహన ర్యాలీ




**నిజామాబాద్, జూలై 12 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చిన్న వాల్గొట్ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టి నులిపురుగుల నివారణ, ఆల్బెండాజోల్ మాత్రల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏఎన్ఎం స్వప్న మాట్లాడుతూ, 1 నుంచి 2 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు అర (½) ఆల్బెండాజోల్ మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఒక పూర్తి మాత్రను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. గ్రామంలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా ఈ మాత్రలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు."మెరుగైన ఆరోగ్యం – మెరుగైన చదువు – బలమైన భవిష్యత్తు" అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల నులిపురుగులు నివారించబడటంతో పాటు రక్తహీనత తగ్గడం, పోషకాహారం శరీరానికి సక్రమంగా అందడం, పిల్లల శారీరక ఎదుగుదల, జ్ఞాపకశక్తి, చదువుపై ఏకాగ్రత పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. అలాగే నులిపురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరణ్య, జూనియర్ అసిస్టెంట్ సుమలత, ఏఎన్ఎం స్వప్న, ఆశ కార్యకర్త సుజాత, అంగన్వాడీ టీచర్లు ఉమారాణి, విజయలత, రాంబాయి, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

# హరితహారానికి త్రివేణి శ్రీకారం



**ఖమ్మం, జూలై 12 (జర్నలిస్ట్ ఫైల్) :**
"ఈరోజు ఒక మొక్క నాటుదాం, రేపటి భవిష్యత్తును కాపాడుదాం" అనే సందేశంతో త్రివేణి టాలెంట్ స్కూల్స్ ఆధ్వర్యంలో వనమహోత్సవం–2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలుపుతూ, తమ విద్యార్థులు పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించారని,ఈ వనమహోత్సవం భూమాతను సంరక్షించే మహోన్నత ఉద్యమమని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఇళ్లు, పాఠశాలలు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఎల్ నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం తగ్గి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించి భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్,ఉపాధ్యాయినీ–ఉపాధ్యాయులు, విద్యార్థినీ–విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఆరికాయలపాడు బీసీ కాలనీలో తాగునీటి కష్టాలు



**ఏన్కూరు, జూలై 12 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఏన్కూరు మండల పరిధిలోని ఆరికాయలపాడు గ్రామానికి చెందిన బీసీ కాలనీలో కొంతకాలంగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు,వంట,ఇతర గృహ అవసరాలకు నీరు లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపారు.సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించి, ప్రజల ఇబ్బందులను తొలగించాలని బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- **జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు**



**ఖమ్మం,(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు శనివారం ఖమ్మం పట్టణంలోని కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, జనాభా నియంత్రణ, తల్లి–శిశు ఆరోగ్యం, సమతుల్య కుటుంబ వ్యవస్థ, బాలికల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అర్హులైన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవాలని, దీనివల్ల నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదలలో ఆటంకాలు వంటి సమస్యలను నివారించవచ్చని వివరించారు.వర్షాకాలం ప్రారంభమైనందున దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి నిల్వ పాత్రలను తరచూ శుభ్రపరచాలని, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్లలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్వీయ వైద్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, వంట పాత్రల శుభ్రత, ఆహార నిల్వ విధానాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహారం అందించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా హెచ్‌పీవీ టీకా యొక్క ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్ డి. రామారావు, అర్హులైన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని, ఈ టీకా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తమ కుమార్తెలకు టీకా వేయించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులను సబ్బుతో తరచుగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి, పి హెచ్ సి ఎం వి పాలెం నుంచి హెచ్ఈఓ బద్రు ఆశాలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్ "రైతు ఆశీర్వాద సభ" ఒక పచ్చి అబద్ధాల సభ

**: ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మండిపాటు**



**ఖమ్మం, జూలై 12 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన "రైతు ఆశీర్వాద సభ" కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే ఒక పచ్చి అబద్ధాల సభ అని, రైతులను ఆశీర్వదించడానికి కాదు, వారిని వంచించడానికి పెట్టిన సభ అని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ మంత్రులు వేదికపై చెప్పినవన్నీ ఒట్టి బూటకపు మాటలేనని ఆయన కొట్టిపారేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఓ ప్రకటనలో, ఈ విధంగా మాట్లాడారు,

**రైతు భరోసా, రుణ మాఫీ అంతా దగా, మాట తప్పిన కాంగ్రెస్**
"కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతాంగాన్ని నట్టేట ముంచింది. ఎకరాకు రూ. 15,000 ఇస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికి, ఇప్పుడు దాన్ని ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తోంది. గత తొమ్మిది రోజుల్లో రూ. 7,491 కోట్లు ఇచ్చామంటూ రేవంత్ రెడ్డి గారు చెబుతున్న లెక్కలన్నీ కాగితాలకే పరిమితం. క్షేత్ర స్థాయిలో ఏ ఒక్క రైతు పూర్తిస్థాయిలో లబ్ధి పొందలేదు. బ్యాంకుల్లో వేల కోట్ల రుణ మాఫీ చేశామని చెబుతున్నా, రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల సాకుతో సగానికి పైగా రైతులను రుణ మాఫీకి దూరం చేశారు. కేసీఆర్ హయాంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లో పడ్డ 'రైతు బంధు' నిధులను నిలిపివేసి, రైతులను భిక్షగాళ్లలా మార్చిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదే."

**అస్తవ్యస్తమైన విద్యుత్, రెవెన్యూ వ్యవస్థలు**
"కేసీఆర్ పదేళ్ల సువర్ణ పాలనలో తెలంగాణ రైతాంగం 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను కళ్లారా చూసింది. రాత్రిపూట బావుల వద్దకు వెళ్లే తిప్పలు తప్పాయి. కానీ ఈ కాంగ్రెస్ 11 నెలల తుగ్లక్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని అంధకారం నెలకొంది. లో–వోల్టేజ్ సమస్యలతో మోటర్లు కాలిపోతున్నాయి. ఇక ధరణి పోర్టల్‌ను రద్దు చేసి 'భూమాత' పేరుతో కాంగ్రెస్ తెస్తున్న మార్పులు కేవలం భూ కబ్జాలకు, పైరవీకారులకు దారులు వేయడానికే. ఈ–పాస్‌బుక్కుల పేరుతో సామాన్య రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నారు."

**కాళేశ్వరం, మేడిగడ్డపై కుట్రపూరిత రాజకీయం**
"తెలంగాణను సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు వారి అజ్ఞానానికి నిదర్శనం. స్వల్ప సాంకేతిక లోపంతో మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగితే, దాన్ని బాగు చేసి రైతులకు నీరివ్వడం చేతగాక, కాంగ్రెస్ ప్రభుత్వం పగటి రాజకీయాలు చేస్తోంది. వరద నీటిని సముద్రం పాలు చేస్తూ, ప్రాజెక్టును ఎండబెట్టి రైతులను కరువులోకి నెడుతున్నారు. కేసీఆర్ కాళేశ్వరం కట్టబట్టే పదేళ్లపాటు తెలంగాణలో కోటి ఎకరాల మాగాణం సాధ్యమైంది. రైతులు పండించిన ప్రతి గింజా కేసీఆర్ విజన్ వల్లే సాధ్యమైంది తప్ప, ఈ కాంగ్రెస్ చేతకానితనం వల్ల కాదు."

**అహంకారం కాంగ్రెస్ నేతలదే – ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం**
"కేసీఆర్ ఫామ్‌హౌస్ గురించి మాట్లాడే రేవంత్ రెడ్డి, తాము సెక్రటేరియట్‌ను వదిలి కేవలం ఢిల్లీ చుట్టూ మోకరిల్లుతున్న విషయాన్ని మరువరాదు. అప్పుల కుప్ప అంటూ తెలంగాణపై విషం చిమ్ముతూ, మరోవైపు ఆరు గ్యారంటీలను అటకెక్కించారు. ఖమ్మం గడ్డ ఎప్పుడూ మోసాన్ని సహించదు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి, వారి మోసపూరిత వాగ్దానాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం మరియు ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పడం ఖాయం. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడి పోరాడుతుంది." అని అన్నారు.

# వైరా మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి రూ.53.82 కోట్ల నిధుల మంజూరుపై సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



**వైరా, జూలై 12 (జర్నలిస్ట్ ఫైల్) :**
వైరా మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.53 కోట్ల 82 లక్షల నిధులను మంజూరు చేసిన సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు అధ్యక్షతన, డా. కాపా మురళి కృష్ణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మరియు వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైరా పట్టణ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వైరా ప్రజల చిరకాల కోరికలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషి చేయడంతో పాటు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నిరంతరం ప్రభుత్వ దృష్టికి స్థానిక సమస్యలను తీసుకెళ్లి నిధులు సాధించారని కొనియాడారు.రూ.53.82 కోట్ల నిధులతో పట్టణంలో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, తాగునీటి సౌకర్యాల మెరుగుదలతో పాటు ప్రజలకు అవసరమైన పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని, వైరా మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు.వైరా అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి, డిప్యూటీ సీఎం శ్రీ భట్టి విక్రమార్క మల్లు కి, అలాగే నిధుల సాధనలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే శ్రీ మాలోత్ రాందాస్ నాయక్ కి నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ నాయకులు వీరంశెట్టి సీతారాములు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలేటి నరసింహారావు, కౌన్సిలర్స్ పణితి సైదులు, మోర్ శ్రీకాంత్, పట్టణ నాయకులు కన్నెగటి నగేష్, పెద్దప్రోలు లక్ష్మయ్య, ఉండ్రూ శ్యామ్ బాబు, వేముల రత్నాకర్, గోరంట్ల పిచ్చరావు, బొర్రా గోవింద రావు, కొల్లి రమేష్, మిట్టపల్లి శ్రీనివాసరావు, నారపోగు రవి, ఏదునూరి శ్రీను (బుజ్జి), బత్తుల శ్రీను, బండారు నాగరాజు, షేక్ రహీమ్ (పండు), వాంకుడోత్ భిక్యా, తేజవత్ నాగేశ్వరావు, ఏదునూరి కోటయ్య, దురిశెట్టి నరసింహారావు, జనార్ధన్, కంభంపాటి సత్యనారాయణ, తోటకూరి శ్రీకాంత్, ఏదుమూరి రాము, గడసందుల దుర్గయ్య, పృధ్వీ, పర్స రవి, గూగులోత్ దుర్గా, ఉయ్యూరి రామకృష్ణ, పూర్ణకంటి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలి

**- బీఎల్‌వోలు ఓటర్లకు పూర్తి సహకారం అందించాలి-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



**మల్కాజిగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.శనివారం కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలాజీనగర్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఫారాలను సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, ఓటర్లు పూరించిన ఫారాలను వెంటనే స్వీకరిస్తున్నారా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి, ఫారాల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓటర్ల నుంచి సేకరించిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజేషన్ చేయాలని, ఈ ప్రక్రియలో పూర్తి జాగ్రత్తలు పాటించాలని ఆపరేటర్లకు సూచించారు. అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు ఆదేశించారు. తమ పరిధిలో అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సూపర్‌వైజర్లకు వెంటనే తెలియజేయాలని సూచించారు.అనంతరం కెపిహెచ్‌బీ ఆరవ దశలోని అపార్ట్‌మెంట్‌లలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన సుదర్శన్ రెడ్డి, ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఇండో ఫార్చ్యూన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి బీఎల్‌వోల పనితీరును సమీక్షించారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హుడికి సులభంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కూకట్పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, కూకట్పల్లి ఎమ్మార్వో అశోక్, డిప్యూటీ కలెక్టర్ ఆంజనేయులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## విహా' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం

**-'విహా' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**తలకొండపల్లి, జూలై 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఆమనగల్లు ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేస్తూ నూతనంగా ఏర్పాటు చేసిన 'విహా' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు .శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై పోస్టాఫీస్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని తలకొండపల్లి మండలం అంతా రం గ్రామానికి చెందిన ప్రముఖ శిశు వైద్య నిపుణులు డా.వెంకటేష్ దంపతుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ,మండల పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు, తలకొండపల్లి కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆమనగల్లు కౌన్సిలర్లు, తదితరులతో కలిసి రిబ్బన్ కత్తిరించి, జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం ఓపీ, ఇన్‌పేషెంట్ వార్డులు,అత్యవసర చికిత్స విభాగం, ల్యాబ్ తదితర సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని అన్నారు.ప్రభుత్వ వైద్య సేవలకు తోడుగా ప్రైవేట్ ఆసుపత్రులు కూడా నాణ్యమైన చికిత్సను అందుబాటు ధరల్లో అందించి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు.'విహా' ఆసుపత్రి కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలవాలనీ ఆకాంక్షించారు.కార్యక్రమంలోడీసీసీ కార్యదర్శి మానయ్య కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి ఏఎంసి డైరెక్టర్ శ్రీశైలం కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్ మాజీ ఎంపీపీ అనిత విజయ్ మాజీ మండల్ ప్రెసిడెంట్ జగన్ ఒగ్గు మహేష్ ఎంగలి ప్రసాద్ కృష్ణ నాయక్ ఖాదర్, ఫరీద్ అలీమ్ మహేష్ గౌస్ కుమార్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నేతాజీ నగర్ లో పర్యటించిన ఎమ్మార్వో..

**-ఇంటి ఇంటికి తిరిగి ఓటర్ గా నమోదు చేయాలని కోరిన బేరీ రాంచందర్ యాదవ్..**





**శేరిలింగంపల్లి, జూలై 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ నమోదు ప్రక్రియ లో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బస్తీ లలో చాలా మంది నిరుపేదలు నివసిస్తున్నారు. కాబట్టి వారికి చదువు రాకపోవడంతో ఫారాలు నింపడం లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ కాలని అద్యక్షుడు బేరి రాంచందర్ యాదవ్ అన్నారు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఆయన కోరిక మేరకునేతాజీ నగర్ కాలనీలో ఓటర్ నమోదు కార్యక్రమం పై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి కాలనీలో పర్యటించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి నమోదు చేయాలని బిఎల్ఎ, బిఎల్ఓ లకు వివరించారు. కాలనీ అధ్యక్షులు రామచందర్ యాదవ్ మాట్లాడుతూ అధికారులు చొరవ తీసుకుని ప్రజలకు సహకరించాలని, ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తూ ఓట్లు గల్లంతు కాకుండా చూడాలన్నారు. అవసరమైతే అధికారుల ను పెంచాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎలక్షన్ అధికారి దీపక్ కుమార్, బి ఎల్ ఓ పరమేష్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, బుడగ జంగాల పంతం వెంకటేష్, పంతం శీను, నాగపురి నగేష్ యాదవ్, ఎండి జాఫర్, శివ యాదవ్, మరియు నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యులు కాలనీ పెద్దలు మహిళా సోదరుల యోజన నాయకులు పాల్గొన్నారు ఓటు మన హక్కు ఓటు నమోదు కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించిన రామచందర్ యాదవ్.

## 'పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం'

**-సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**ఖమ్మం, జూలై 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.35,91,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మూడు కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మసాన్ పల్లిలో వైభవంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, కల్యాణ మహోత్సవం



**ములుగు (జర్నలిస్ట్ ఫైల్) :** సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్ర పరిధిలోని మసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శనివారం కన్నులపండువగా జరిగింది. గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మ తల్లి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఒడిబియ్యం పోసి, మంగళహారతులతో బోనాలు సమర్పించారు. మాసన్‌పల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలు, పూజలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కల్యాణం అనంతరం భక్తులందరికీ కమిటీ సభ్యులు భారీగా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దయతో గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలు ఇంత ఘనంగా జరగడానికి ధన, వస్తు రూపేణా సహకరించిన దాతలకు, రాత్రింబవళ్లు కష్టపడిన గ్రామ యువకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ కులస్థులు, మహిళలు, యువకులు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

## బీసీలే రాజ్యాధికారం సాధించాలి

**- తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు తుప్పతి భిక్షపతి**



**గజ్వేల్ (జర్నలిస్ట్ ఫైల్) :** స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అగ్రవర్ణాల ఆధిపత్య పాలన కొనసాగుతోందని, ఇక ఆ పరిస్థితికి ముగింపు పలికి బీసీలు రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు తుప్పతి బిక్షపతి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో జరిగిన మహాసభ విజయవంతం కావడం బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని అన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, కులాలకు అతీతంగా బీసీ రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ తెలంగాణ రాజ్యాధికార పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్, అలాగే పార్టీ మండల, యువజన, రైతు విభాగాల నాయకులు, మల్లన్న అభిమానులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లాపూర్ ఎస్సీ కాలనీలో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభోత్సవం చేసిన గ్రామ సర్పంచ్గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యం - మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి



**షాద్‌నగర్,(జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని మల్లాపూర్ గ్రామములోని ఎస్సీ కాలనీలో గత సంవత్సరం నుండి డ్రైనేజీ ప్రాబ్లం వల్ల ప్రజలకు నానఇబ్బందిలూ ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ నరసింహారెడ్డి అన్నాడు గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యం గా మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి అన్నారు. శనివారం కొత్తూరు మండలంలోని మల్లాపూర్ ఎస్సీ వాడలో సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అండర్ డ్రైనేజ్ పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యంగా అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వరూప,పంచాయతీ సెక్రెటరీ విక్రమ్ రెడ్డి,వార్డు సభ్యులు పవిత్ర జయేందర్ రెడ్డి,స్వాతి రాజేష్,వరుణ్ గౌడ్,ప్రశాంత్, గ్రామ పెద్దలు నాయకులు పెంటారెడ్డి,పాపిరెడ్డి,దయానంద్ రెడ్డి,దామోదర్ రెడ్డి,శేఖర్ రెడ్డీ, సుదర్శన్,పెద్ద నరసింహ, సుధాకర్,రాజు,నరసింహ,నవీన్, శ్రీశైలం,పద్మయ్య,దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ-ఎయిమ్స్ యాప్ ద్వారా 1,525 టన్నుల ఎరువుల కొనుగోలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ-ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 5,443 మంది రైతులు 1,525 టన్నుల ఎరువులను కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. శనివారం వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, జూన్ 8 నుంచి అమల్లోకి వచ్చిన ఈ యాప్ ద్వారా 1,049 టన్నుల యూరియా, 476 టన్నుల డీఏపీ విక్రయించినట్లు వెల్లడించారు. రైతులకు అవసరమైన ఎరువులను పారదర్శకంగా, శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా అందించడంతో పాటు అక్రమ నిల్వలు, దారి మళ్లింపులను అరికట్టేందుకే ఈ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఖరీఫ్-2026కు జిల్లాలో ప్రస్తుతం 41,583 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసిన సాగు వివరాల ఆధారంగా అవసరమైన ఎరువులను ముందుగానే ప్రణాళికాబద్ధంగా అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు అవసరమైన ఎరువులను తొలి విడతలోనే అందిస్తుండగా, పెద్ద రైతులకు మాత్రమే విడతల వారీగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. వెబ్‌ల్యాండ్ లేదా ఇతర భూ రికార్డుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొనే రైతులకు రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ అధికారులు సహకరించాలని ఆదేశించారు. ఏపీ-ఎయిమ్స్ 2.0 యాప్‌పై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## మెగా జాబ్ మేళా కు విశేష స్పందన



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ) : బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల నందు సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగుల నుండి విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని కొప్పర్తి ప్రాంతంలో ఏర్పాటు చేసిన డెక్సన్ కంపెనీ వారి తరపున కళాశాలలో జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ఈ జాబ్ మేళాకు మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని అర్హత సాధించారని వారికి త్వరలోనే నియామక పత్రాలను అందజేసి ఉద్యోగాన్ని కల్పిస్తామని ఉద్యోగం పొందిన వారికి ఆకర్షణీయమైన జీతంతో పాటు ఉచిత భోజన రవాణా వసతి సౌకర్యం కల్పిస్తామని వారు తెలిపారు అంతేకాకుండా మా కళాశాల ఆధ్వర్యంలో ఇక మీదట ప్రతినెల ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకులను దృష్టిలో ఉంచుకొని జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఇందులో సాఫ్ట్వేర్ కు సంబంధించిన జాబ్ అలాగే హార్డ్వేర్ మరియు మరియు టెక్స్టైల్ వంటి కంపెనీల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ సంస్థ ద్వారా కృషి చేస్తామని ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు మరో రెండు రోజులే గడువు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు మరో రెండు రోజులే గడువు ఉందని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) కె. మయూర్ అశోక్ తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఇంకా సమర్పించని ఓటర్లు వెంటనే వాటిని నింపి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. లేకపోతే ఈ నెల 21న ప్రచురించే ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2,52,062 మంది ఓటర్లకు గాను 2,51,957 ఎన్యూమరేషన్ ఫారాలను (99.96 శాతం) పంపిణీ చేయగా, వాటిలో 1,88,435 ఫారాలను (74.76 శాతం) డిజిటైజ్ చేసినట్లు తెలిపారు. అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 2,78,555 మంది ఓటర్లకు గాను 2,78,264 ఫారాలను (99.90 శాతం) పంపిణీ చేసి, వాటిలో 2,00,554 ఫారాలను (72 శాతం) డిజిటైజ్ చేసినట్లు వెల్లడించారు. ఓటర్లు ఈ ప్రక్రియలో సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## మీ ఓటు హక్కు మీ చేతుల్లోనే ఉంది : ఎమ్మెల్యే నసీర్

- పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే తిరిగి ఇవ్వండి
- ఫారాలు నింపడంలో కూటమి నేతల సహకారం తీసుకోండి
- సర్‌పై ప్రజలు చైతన్యవంతులు కావాలి
- బీఎల్వోలకు పూర్తి సహకారం అందించాలి
- గుంటూరు తూర్పులో నూరు శాతం మ్యాపింగ్ అవ్వాలి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో భాగంగా

ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే ఎన్నికల అధికారులకు అందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సర్ కార్యక్రమం పూర్తి కావడానికి కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. ఫారాలు అందుకున్న వారు తమ వద్ద ఉంచుకోకూడదని తెలిపారు. పూర్తి చేసిన ఫారాలను తిరిగి ఇవ్వని పక్షంలో ఓటు హక్కు రద్దయ్యే అవకాశం ఉందని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో బూత్ లెవెల్ అధికారులు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకుంటున్నారని అన్నారు. కుటుంబీకుల వివరాలను ఓట్లకు మ్యాచ్ అవుతున్నాయో ? లేదో సరి చూసుకోవాలన్నారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున గుంటూరు తూర్పు నియోజకవర్గ ఓటర్లందరూ వెంటనే స్పందించాలని కోరారు. ఇప్పటి వరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో

85 శాతం మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన రెండు రోజుల్లో నూరు శాతం ఎన్యూమరేషన్ పూర్తి అయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయడంలో ఏవైనా సందేహాలు ఉంటే కూటమి నాయకుల వద్ద సహకారం తీసుకోవాలని, వారు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. సర్ గడువు చివరి రోజుల్లో ఏవైనా సర్వర్ సమస్యలు తలెత్తితే ఇబ్బందులు ఎదురవుతాయని, కావున ఓటర్లందరూ చైతన్యవంతులై సర్ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## గుంటూరు జిల్లాలో లాడ్జీలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) : జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గుంటూరు నగర, జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న లాడ్జీలు, హోటళ్లలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పోలీసులు ఏకకాలంలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆయా డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, ప్రత్యేక పోలీసు బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించడం, లాడ్జీల్లో బస చేస్తున్న వారి గుర్తింపు వివరాలను పరిశీలించడం, పరారీలో ఉన్న నేరస్థులు లేదా వారెంట్లు ఉన్న వ్యక్తులు ఆశ్రయం పొందారా అనే కోణంలో తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తనిఖీల సందర్భంగా లాడ్జీ యాజమాన్యాలకు పలు కీలక సూచనలు జారీ చేశారు. ప్రతి అతిథి నుంచి ఆధార్ లేదా ప్రభుత్వ గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించి రికార్డులు నిర్వహించాలని, పూర్తి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, సీసీటీవీ కెమెరాలు 24 గంటలు పనిచేసేలా చూసుకోవడంతో పాటు కనీసం 30 రోజుల వీడియో బ్యాకప్ భద్రపరచాలని ఆదేశించారు.

అనుమానాస్పద వ్యక్తులు, డ్రగ్స్, ఆయుధాలు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు లేదా 100/112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గుర్తింపు పత్రాలు లేకుండా గదులు కేటాయించడం లేదా వ్యభిచారం, జూదం, మాదకద్రవ్యాల వంటి అసాంఘిక కార్యకలాపాలకు సహకరించే లాడ్జీలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే లైసెన్సులు రద్దు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో 1,987 కేసుల పరిష్కారం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) : గుంటూరు జిల్లా పోలీసుల సమన్వయంతో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో 1,987 కేసులు రాజీ ద్వారా పరిష్కారమైనట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

గుంటూరు ప్రధాన జిల్లా న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి మార్గదర్శకత్వంలో, ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోలారు లత ఆధ్వర్యంలో జులై 11న నిర్వహించిన లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా పోలీసులు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది సమన్వయంతో ఈ ఫలితం సాధ్యమైందన్నారు. అదనంగా ఎఫ్ఐఆర్ నమోదు కాని 10,679 పెట్టీ కేసులను కూడా పరిష్కరించినట్లు వెల్లడించారు. పరిష్కారమైన కేసుల్లో 766 ఐపీసీ లోక్ అదాలత్ కేసులు, 259 ఐపీసీ కన్విక్షన్ కేసులు, 28 ఎక్సైజ్ కేసులు, 43 ఇసుక కేసులు, 816 ఏపీ పోలీస్ చట్టం (ఓపెన్ డ్రింకింగ్) కేసులు, 75 గేమింగ్ చట్టం తదితర కేసులు ఉన్నాయి.

తూర్పు డివిజన్‌లో 239, పశ్చిమ డివిజన్‌లో 453, ఉత్తర డివిజన్‌లో 465, దక్షిణ డివిజన్‌లో 335, తుళ్లూరు డివిజన్‌లో 188, తెనాలి డివిజన్‌లో 233, ట్రాఫిక్ విభాగంలో 25, మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో 49 కేసులు పరిష్కరించినట్లు ఎస్పీ తెలిపారు.

లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన పోలీసు అధికారులు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, ప్రభుత్వ న్యాయవాదులు, ఇతర శాఖల అధికారులను ఆయన అభినందించారు.

రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి లోక్ అదాలత్ వంటి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదికలను వినియోగించుకోవాలని, దీనివల్ల కోర్టులపై పెండింగ్ కేసుల భారం తగ్గడంతో పాటు ప్రజలకు వేగవంతమైన న్యాయం అందుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

- ప్రజా దర్బార్ కు వినతుల వెల్లువ



వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్): ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజల కోసం చీఫ్ విప్ వారి కార్యాలయము నందు ఆదివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు ప్రజా దర్బార్ కు హాజరై వారి సమస్యలను చీఫ్ విప్ జీవి ఆంజనేయులుకు విన్నవించుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతానని చీఫ్ విప్ జీవి పేర్కొన్నారు. 47 అర్జీలు వచ్చాయి వినుకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో పింఛన్లు, సైడ్ డ్రైన్స్, సిసి రోడ్స్, భూసమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వివిధ వర్గాల ప్రజలు విన్నవించారు. ఫిర్యాదులను పరిశీలించిన చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి పాలనలో ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని వివరించారు. సంక్షేమం అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తూ ప్రజా ప్రభుత్వం గా ప్రజల మన్ననలు పొందిందన్నారు.

## రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) : నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత ఉన్న వారికి ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించినట్లు గుంటూరు జిల్లా పోలీసులు తెలిపారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలికి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల ఒక రౌడీషీటర్‌పై పీడీ చట్టం అమలు చేసి రాజమహేంద్రవరం జైలుకు పంపినట్లు పోలీసులు వెల్లడించారు.

అలాగే బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన రౌడీషీటర్లను మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రౌడీషీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులపై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతోందని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

## వివాలో 'ఐక్యరాజ్యసమితి నమూనా' సదస్సు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):అంతర్జాతీయ వ్యవహారాలపై అవగాహన, నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి చెందేలా 'వివా ది స్కూల్' విద్యార్థులు ఆగష్టు 7 నుండి 9 వరకు మూడు రోజుల పాటు మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఐక్యరాజ్యసమితి నమూనా) సదస్సును నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వెబ్‌సైట్, నమోదు ప్రక్రియను వివా ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ విద్యార్థులతో కలిసి ప్రారంభించినట్లు వివా యాజమాన్య సభ్యురాలు వాసిరెడ్డి ప్రత్యూష తెలిపారు.

మూడు రోజుల పాటు వివా విద్యార్థులు నిర్వహించనున్న ఈ సదస్సులో ఐక్యరాజ్యసమితిలో భాగమైన ప్రతినిధుల సభ, భద్రతా మండలి, సచివాలయం, అంతర్జాతీయ న్యాయస్థానం, ఆర్థిక-సామాజిక మండలి సభ్యులుగా ఏర్పడి, ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు పలు అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు.

గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, పలు జాతీయ, అంతర్జాతీయ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనడానికి అర్హత గల విద్యార్థులు 'వివాఎమయూఎన్. వివా.స్కూల్' నందు నమోదు చేసుకోవాలని కోరారు."

## మానవత్వం చాటుకున్న సిఐ విజయలక్ష్మి



- వైద్య ఖర్చులకు 10వేల విరాళం
- గతంలోనూ సహాయం అందించిన సీఐ విజయలక్ష్మి

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):ఆమె ఓ నిర్భాగ్యురాలు ఆదరించే వారు లేక సహాయం కోసం ఎదురుచూసే ఓ వృద్ధ మహిళ 50 సంవత్సరాల వయసు పైబడి షుగర్ వ్యాధితో కాలికి తీవ్రమైన గాయం తగిలి వైద్యుల సూచన మేరకు కాలును తొలగించి నిర్భాగ్య స్థితిలోకి వెళ్లిన ఓ దీన స్థితిని గడుపుతున్న మహిళ చేయూతనందించే వారు లేక ఆకలితో అలమటిస్తూ తోడుందించేవారు భర్త పిల్లలు బంధువులు ఎలాంటి వారు లేక సహాయం కోసం నిస్సహాయ స్థితిలో ఎదురుచూసే ఒంటరి మహిళ అలాంటి నిర్భాగ్య మహిళకు నేనున్నానంటూ మానవతా దృక్పథంతో గొప్ప మనసుతో చేయుతనందించింది సిఐ విజయలక్ష్మి.

వివరాల్లోకెళ్తే బ్రహ్మంగారిమఠం మండలం మద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మీదేవి 50 సంవత్సరాల వయస్సు పైబడి కలిగి కాలిన గాయాలతో బొబ్బలు వచ్చి షుగర్ వ్యాధి వల్ల ఆ గాయాలకు పురుగులు పట్టడం తీవ్ర అనారోగ్య స్థితికి వెళ్లి డాక్టర్లు చూసిన మేరకు కాలు తీసేయగా ఆ మహిళ జీవించడానికి కష్టమైన ఆదరించే భర్త పిల్లలు ఎవరూ లేని స్థితిలో కేవలం ప్రభుత్వ అందించే పింఛనుతో జీవనం సాగిస్తూ తినడానికి తిండి లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో గొప్ప మానవతా హృదయంతో మానవత్వాన్ని చాటుకుని ఆమె వైద్య ఖర్చులకోసం పదివేల రూపాయలను అందించి ఆమెకు కావలసిన వైద్యాన్ని అందించడం కోసం తనకు తెలిసిన వైద్య నిపుణులు సంప్రదించి వారి సహాయం అందించేలాగా చేసింది గతంలోనూ ఆమె జీవించడం కోసం ఐదు వేల రూపాయల నగదు తో పాటు మరియొక పర్యాయం ఆమె జీవనోపాధికి కొన్ని నెలలకు సరిపడా సరుకులను అందించారు.

ఇంతటి మానవతా దృక్పథంతో గొల్ల లక్ష్మీదేవికి సహాయం చేసిన సీఐ విజయలక్ష్మిని పలువురు అభినందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా ఎవరైనా గొల్ల లక్ష్మీ దేవికి సహాయం చేసే దాతలు ఉంటే దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని ఆమె తెలిపారు .

# అలరించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ నందు 1990-1991 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థిని విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్వహించారు. ఉదయం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పూర్వ విద్యార్థులు దర్శించుకుని అనంతరం భారీ ర్యాలీతో జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకున్నారు. అనంతరం మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు నీ కలిసి ఆశీర్వచనములు ఉంది స్వామివారి తీర్థ ప్రసాదాలను అందిపుచ్చుకున్నారు .అనంతరం వారి సోదరుడు దత్తాత్రేయ స్వామి వారి తోటి మిత్రులకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, ఫోటో ,రుద్రాక్ష ప్రసాదలను అందజేశారు. అనంతరం జగన్మాత శ్రీ జగన్మాత అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివకుమార స్వామివారిని దర్శించి ఈ సందర్భంగా స్వాములవారు వారికి ప్రసాదలు అందజేశారు. అనంతరం ఐదు రోడ్ల కూడలి నుంచి డీజే తో నృత్యాలు చేసుకుంటూ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంసమావేశాన్ని కి ఆ స్కూలు ఇన్చార్జి హెడ్ మాస్టర్ నరసింహారెడ్డి అధ్యక్షత వహించి సభను ప్రారంభించారు. విద్యార్థినిలు జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా 1990 బ్యాచ్ ఉపాధ్యాయులు చలమయ్య, ఓబుల్ రెడ్డి, చెన్నారెడ్డి, సివి సుబ్బారెడ్డి హాజరయ్యారు. విశ్రాంతి ఉపాధ్యాయులు చలమయ్య మాట్లాడుతూ మా విద్యార్థులు ఒక సదుద్దేశముతో పూర్వ విద్యార్థుల కలయికను ఏర్పాటు చేసి నేను పనిచేసిన నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకునే అదృష్టం కల్పించినందుకు నాకు చాలా సంతోషంగా ఉందని విద్యార్థులంతా కూడా ఉన్నత స్థాయిలో ఉన్నందుకు వారి ఉపాధ్యాయుడిగా నాకు గర్వంగా ఉందని తెలియజేశారు. అనంతరం ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా తమ బిడ్డ లాంటి వాళ్ళని వారి ఎదుగుదల చూస్తుంటే తమ బిడ్డల ఎదుగుదల చూస్తున్నట్లుగా మనసు పులకరించిందని ఆనాడు నేను సైన్స్ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబోధన చేసి వారి జ్ఞానాన్ని పెంపొందించనని ఆ జ్ఞానపు వృక్షము నేడు ఇంతమంది ప్రయోజకులను చేసినందుకు ఉపాధ్యాయుడిగా నాకు గర్వంగా ఉందని ఆయన తెలిపారు. పూర్వపు విద్యార్థి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామి మాట్లాడుతూ విద్య చాలా విలువైనదని విద్య లేనిదే మానవ మనుగడ లేదని విద్య పరులు దోచలేని సంపదని అలాంటి విద్యాబుద్ధులు మాకు నేర్పించిన మా గురువులను నేడు ఈ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక నేడు వారిని కలిసి వారి ఆశీస్సులను పొందడం మా పూర్వజన్మ సుకృతం అని అన్నారు, మరొక పూర్వ విద్యార్థి ఆవుల దస్తగిరి నాయుడు మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్చుకునే సమయంలో మా ఉపాధ్యాయులు మమ్మల్ని సన్మార్గంలో నడిపించడం కోసం వారు నిరంతరం కష్టపడి తమ విద్యార్థులు ప్రయోజకులు కావాలని మమ్మల్ని సన్మార్గంలో నడిపిస్తూ వారు అనేక రూపాలుగా మమ్మల్ని ప్రయోజకులు చేయడం కోసం కృషి చేశారని ఆనాటి కాలంలో తమకు లోక పరిజ్ఞానం తెలియకున్న లోకాన్ని లోకజ్ఞానాన్ని మాకు నేర్పించి మా అంధకారాన్ని తొలగించిన గొప్ప మార్గదర్శకులు మా గురువులని ఆయన కొనియాడారు. అనంతరం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఇంతటి విజయవంతం చేయడానికి కృషి చేసిన ఆర్గనైజర్ దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమతో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులంతా కూడా కలిసి ఒక చోటికి రావడం చాలా శుభదాయకమని ఎప్పుడో 35 సంవత్సరాల క్రితం తామంతా ఈ పాఠశాలలో చదువుకొని వృత్తిరీత్యా అనేక ప్రాంతాల్లో స్థిరపడ్డాము నేడు ఈ ఆత్మీయ కలయిక ద్వారా అందరం ఒకచోట కలుసుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## తెనాలిలో హెరిటేజ్ ఫుడ్ ఐటమ్స్ షోరూమ్ ప్రారంభం



○ ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

**తెనాలి, (జర్నలిస్ట్ ఫైల్ ) :** నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెనాలి పట్టణంలోని మాదిస్‌పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన హెరిటేజ్ ఫుడ్ ఐటమ్స్ షోరూమ్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ, నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్న వినియోగదారులు ప్రస్తుతం హెరిటేజ్ ఉత్పత్తులను ఎక్కువగా ఆదరిస్తున్నారని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన పాల ఉత్పత్తులు అందించాలనే సంకల్పంతో ఈ ప్రాంతంలో హెరిటేజ్ ఫుడ్ ఐటమ్స్ షోరూమ్ ఏర్పాటు కావడం అభినందనీయమని అన్నారు. వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టేలా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. హెరిటేజ్ రీజినల్ ఇన్‌చార్జి బాలు మాట్లాడుతూ, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల హెరిటేజ్ పాల ఉత్పత్తులు షోరూమ్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ నిర్వాహకులు దివ్య, శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ నాయకులు మహమ్మద్ కుద్దూస్, పెండ్యాల వెంకటరావు, రావి చిన్ని, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలి: బీజేపీ మాధవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముంబైలో విజయవంతంగా భుజానికి శస్త్రచికిత్స పూర్తికావడం పట్ల ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పవన్ కల్యాణ్ త్వరితగతిన పూర్తిగా కోలుకుని, మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

దీర్ఘకాలంగా భుజాల నొప్పిని భరిస్తూనే ప్రజాసేవకు, రాష్ట్ర అభివృద్ధికి అంకితభావంతో నిరంతరం కృషి చేస్తున్న పవన్ కల్యాణ్‌కు విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తికావడం సంతోషకరమని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొని రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

## సంకల్ప బలంతోనే విజయాలు సాధ్యం: ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ )** సంకల్ప బలం, క్రమశిక్షణతో కూడిన విద్యార్థులే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం, జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. బ్రిందావన్ గార్డెన్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులను సత్కరించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఒంటి కాలితో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన అరుణిమ సిన్హా జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని లక్ష్య సాధన కోసం కృషి చేయాలని సూచించారు.

చదవాలనే సంకల్పం ఉంటే అవసరమైన సహాయ సహకారాలను స్ఫూర్తి ఫౌండేషన్‌తో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ అందిస్తుందని లేళ్ల అప్పిరెడ్డి హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అభివృద్ధి కమిటీ సమిష్టి కృషి వల్లే పాఠశాల నూటికి నూరు శాతం ఫలితాలు సాధించడంతో పాటు జూనియర్ కళాశాల విద్యార్థిని ఐఐటీలో సీటు సాధించగలిగిందని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి, ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామచంద్రరావు, జాతీయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహనరావు, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌కు చివరి రెండు రోజులే.. ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా సమర్పించండి: కలెక్టర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ )** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు మరో రెండు రోజులే గడువు ఉందని, అర్హులైన ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ మంగళవారంతో ముగుస్తుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ జరుగుతుందని, ఆ జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన వివరాలను సక్రమంగా సమర్పిస్తే ఓటరుగా కొనసాగుతారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఓటరే స్వయంగా పూర్తి చేసి సంతకం చేసి ఇవ్వాలని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఆదివారం కూడా ప్రత్యేక శిబిరాలు కొనసాగుతున్నాయని, ఓటర్లు వాటిని సందర్శించి తమ వివరాలను ధృవీకరించుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటరుగా ఉండటం గౌరవంతో పాటు బాధ్యత కూడా అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలన్నదే భారత ఎన్నికల కమిషన్ లక్ష్యమని, అందరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## వత్సవాయి ఎంజేపీ గురుకులాన్ని జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్

○ మంత్రి సవిత



**వత్సవాయి/జగ్గయ్యపేట, (జర్నలిస్ట్ ఫైల్ ) :** వత్సవాయి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత హామీ ఇచ్చారు. ఆదివారం పీ-4 విధానంలో ఎన్ఆర్ఐ చిరుమామిళ్ల రాంబాబు దంపతుల సహకారంతో రూ. 75 లక్షల వ్యయంతో నిర్మించిన డైనింగ్ హాల్, డార్మెటరీని ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ పీ-4 విధానం ద్వారా పేదరిక నిర్మూలనతో పాటు గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. తమ స్వగ్రామాల అభివృద్ధికి సంపన్నులు ముందుకు రావాలని పిలుపునిస్తూ, చిరుమామిళ్ల రాంబాబు దంపతుల సేవా దృక్పథం ఇతర దాతలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్పొరేట్ విద్యాసంస్థల కంటే ఎంజేపీ గురుకులాలకు అధిక ఆదరణ లభిస్తోందని, విద్యాశాఖలో తీసుకొచ్చిన సంస్కరణలతో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 109 గురుకులాలు ఉన్నాయని, ఈ ఏడాది మరో 10 కొత్త గురుకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆరు బాలికల ఎంజేపీ గురుకులాలను ఇప్పటికే జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశామని, రూ. 500 కోట్లతో గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. బీసీ హాస్టళ్ల స్థానంలో గురుకులాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం, ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు, ఇన్వర్టర్లు, దోమతెరలు ఏర్పాటు వంటి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. డైట్ ఛార్జీలను 10 శాతం పెంచనున్నట్లు ప్రకటించారు. అనంతరం గురుకుల విద్యార్థులకు స్పోర్ట్స్ ట్రాక్‌సూట్లు పంపిణీ చేసి వారితో కలిసి భోజనం చేసిన మంత్రి, పాఠశాల మౌలిక వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, గురుకుల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపుపై సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్

○ పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం దేశవ్యాప్త ఉద్యమం కొనసాగిస్తాం: గణపతి రావు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయింపు కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయాలని అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య (ఏఐపీటీఎఫ్) జాతీయ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఏఐపీటీఎఫ్ జాతీయ అధ్యక్షుడు బసవరాజ్ గురికర్ అధ్యక్షతన శనివారం జూమ్ ద్వారా నిర్వహించిన అత్యవసర జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఏజీఎస్ గణపతి రావు తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని కూడా సమావేశం నిర్ణయించిందన్నారు.

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపుపై ఇప్పటికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మూడుసార్లు కలిసి విజ్ఞప్తి చేసినట్లు, ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామని హామీ ఇచ్చారని గణపతి రావు తెలిపారు. త్వరలోనే కేంద్ర హోంమంత్రి, ప్రధానమంత్రిని కలిసి మరోసారి వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు. క్యూరేటివ్ పిటిషన్‌ను వీలైనంత త్వరగా దాఖలు చేయాలని న్యాయవాది విక్రమ్ హెగ్డేను కోరినట్లు వెల్లడించారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఎంపీలను కలిసి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అంశాలపై చట్టసభల్లో ఒత్తిడి తీసుకురావాలని సమావేశం తీర్మానించిందని తెలిపారు. ఈ సమావేశంలో ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రకాశ్ రావు, ప్రధాన కార్యదర్శి మెహిదీ మీర్జా తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవం పేరుతో రాష్ట్రంలో కుట్రలు

○ హిందూ ధర్మంపై దాడులను సహించం : బీజేపీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) :** గుంటూరు నగరంలోని అరండల్‌పేట మూడో లైన్ యోగి భవన్‌లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసమేనని పేర్కొన్నారు. మతం మారిన వారికి షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లు వర్తించవని, ఈ అంశంపై చట్టపరంగా పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. మత మార్పిడులను ప్రోత్సహించే ప్రయత్నాలను అడ్డుకుంటామని, రాజ్యాంగంలోని సంబంధిత అధికరణాల ప్రకారం మైనారిటీలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో దళితవాదం పేరుతో కొందరు ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ, అలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తూ, హిందూ ధర్మాన్ని అవమానించే వ్యాఖ్యలను బీజేపీ సహించబోదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, దళిత క్రైస్తవం పేరుతో రాష్ట్రంలో అలజడి సృష్టించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు ఆదరిస్తున్న నేపథ్యంలో కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాలు రేపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధారా అంబేద్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో సరుహ కిలారు సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రివ్యూకు తరుణ్ చుగ్ హాజరు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రముఖ మల్టీడిసిప్లినరీ కళాకారిణి సరుహ కిలారు రూపొందించిన సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ "దేర్ ఆర్ రివర్స్ ఇన్ ది స్కై" ప్రివ్యూను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు తరుణ్ చుగ్ శనివారం ఢిల్లీలోని త్రివేణి కళా సంగమ్‌లో ఉన్న శ్రీధరణి ఆర్ట్ గ్యాలరీలో సందర్శించారు. ప్రియాంశి ఎస్ క్యూరేటర్‌గా వ్యవహరిస్తున్న ఈ ప్రదర్శన జూలై 17 వరకు సందర్శకులకు అందుబాటులో ఉండనుంది. కార్యక్రమానికి బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ కిలారు దిలీప్ కూడా హాజరయ్యారు. ప్రదర్శనను ఏర్పాటు చేసిన కళాకారిణి సరుహ కిలారు ఆయన కుమార్తె.

టర్కీ రచయిత్రి ఎలిఫ్ షఫాక్ రచించిన అదే పేరుతో ఉన్న నవల నుంచి స్ఫూర్తి పొందిన ఈ ప్రదర్శనలో నీరు, జ్ఞాపకాలు, పర్యావరణం, మానవ జీవితం మధ్య ఉన్న అనుబంధాన్ని వినూత్నంగా ఆవిష్కరించారు. గాజు శిల్పాలు, ప్రింట్ మేకింగ్, మోనోప్రింట్లు, మిశ్రమ మాధ్యమ కళాఖండాల ద్వారా నీటిని పరివర్తన, చరిత్ర, ప్రకృతి పరస్పర అనుసంధానానికి ప్రతీకగా చిత్రీకరించారు. అరవల్లి ప్రాంతంలోని సున్నితమైన పర్యావరణ వ్యవస్థలు, అంతరించిపోతున్న వృక్షజాలం, జీవవైవిధ్య పరిరక్షణ వంటి అంశాలను ప్రతిబింబించే ఈ కళాఖండాలు ప్రకృతి సంరక్షణపై కళాకారిణి దృక్పథాన్ని ప్రతిఫలిస్తున్నాయి. 1998లో జన్మించిన సరుహ కిలారు లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్‌లో ప్రింట్ విభాగంలో ఎంఏ పూర్తి చేసి, భారత్‌తో పాటు విదేశాల్లోనూ తన కళాఖండాలను ప్రదర్శించారు. ప్రస్తుతం ఢిల్లీలోని కాల్వి స్టూడియోస్ సహ వ్యవస్థాపకురాలిగా కొనసాగుతున్నారు.

## ఒక్క వాట్సప్ మెసేజ్ చేయండి - సమస్య తీరుస్తా : ఎమ్మెల్యే బాలకృష్ణ



**హిందూపురం (జర్నలిస్ట్ ఫైల్ ) :** ఒక్క వాట్సప్ మెసేజ్ చేయండి! వెంటనే మీ సమస్య తీరుస్తా అంటున్నారు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ. హిందూపురం ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా వాట్సప్‌లో తనను కాంటాక్ట్ చేయవచ్చని బాలకృష్ణ పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తీర్చడానికి సదా సిద్ధంగా ఉంటానని చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు.

ఈ క్రమంలోనే హిందూపురం రూరల్ రాచపల్లి వద్ద మడకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు పనులకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి బాలకృష్ణ భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ. 790 కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా బాలకృష్ణ స్వయంగా ప్రొక్లెయిన్ ఎక్కి కాలువ పనులను ప్రారంభించారు. ప్రొక్లెయిన్ నడుపుతూ ఆయన అందరినీ ఆకట్టుకున్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకే సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

హిందూపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు బాలకృష్ణ తెలిపారు. వ్యవసాయం నుంచి ప్రజా సౌకర్యాల వరకు సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. హంద్రీనీవా కాల్వ వెడల్పుతో ఇక సాగు, తాగునీటికి ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు.

అనంతరం బాలకృష్ణ చౌడేశ్వరి కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కును, స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రక్త నిధి కేంద్రం, ఎంజీఎం హైస్కూల్ క్రీడా మైదానంలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ టేబుల్ టెన్నిస్, షటిల్ ఆడి ఆకట్టుకున్నారు. ఆ తర్వాత కోనేరులో జరుగుతున్న అభివృద్ధి పనులు, రైల్వే రోడ్డులో సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం పళని నగర్‌లో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్?ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. "హిందూపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. ఆ దిశగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ప్రజాభివృద్ధి ప్రజా సంక్షేమంతో పాటు ప్రజలు ఆహ్లాదకరంగా ఉండేందుకు నూతన ఉద్యానవనాలు. మానసిక ఒత్తిడిని అదగమించడానికి క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. నాడు స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారు."

## జానకమ్మకు సీఎం చంద్రబాబు నివాళి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** : శనివారం తుదిశ్వాస విడిచిన గాన కోకిల, ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జానకి చిత్రపటానికి పూలమాల వేసి ఆమెకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. భారతీయ సంగీత రంగానికి జానకి అందించిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా సీఎం స్మరించుకున్నారు.

తెలుగు నేలపై జన్మించిన జానకి ఆరు దశాబ్దాలకు పైగా తన మధుర గానంతో కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చంద్రబాబు పేర్కొన్నారు. ఆమె ఆలపించిన పాటలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. జానకి మరణం భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జానకి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## 13న సంస్కృత మేధావుల సదస్సు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలుగు మరియు సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో సంస్కృత పండితులు, మేధావులతో ప్రత్యేక సదస్సు ఈ నెల 13న విజయవాడ సమీపంలోని వడ్డేశ్వరంలో నిర్వహించనున్నట్లు అకాడమీ చైర్మన్ ఆర్. డి. విల్సన్ (శరత్ చంద్ర) తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సదస్సులో సంస్కృత భాష విస్తరణకు చేపట్టాల్సిన కార్యాచరణపై మేధావులతో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.

"అందరికీ సంస్కృతం.. అందరిలోకీ సంస్కృతం" అనే నినాదంతో సంస్కృత భాషను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని విల్సన్ తెలిపారు. సంస్కృత సప్తాహంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే అకాడమీ ఆధ్వర్యంలో 'పఠిత సంస్కృతం' పేరిట పుస్తకాలను ప్రచురించామని చెప్పారు. సంస్కృత భాషను సామాన్య ప్రజలకు చేరువ చేయడమే అకాడమీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## ఇ.వి.వి యువ కళావాహిని ఆధ్వర్యంలో తాడిశెట్టి వెంకట్రావు జన్మదిన వేడుకలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) :** మాజీ శాసన సభ్యులు తాడిశెట్టి వెంకట్రావు జన్మదిన వేడుకలు ఆదివారం ఇ.వి.వి యువ కళావాహిని అధ్యక్షులు వెచ్చా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి.

ఈ సందర్భంగా అభిమానుల మధ్య జన్మదిన భారీ కేక్ ను తాడిశెట్టి వెంకట్రావు కట్ చేయగా, వెచ్చా కృష్ణమూర్తి తదితరులు తాడిశెట్టి వెంకట్రావును ఘనంగా సత్కరించారు. అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ.. ఆత్మీయుల మధ్య పుట్టినరోజును జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

వెచ్చా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వెంకట్రావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

తొలుత వెంకట్రావు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, వెచ్చా కృష్ణమూర్తి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో కళావాహిని సభ్యులు అనిల్ రెడ్డి, గోవర్ధన్, అన్నంరాజు సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బస్సులు, డిపోల పునరుద్ధరణపై స్పష్టత వచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుంది

○ ఆర్టీసీ జేఏసీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** విద్యుత్ బస్సుల నిర్వహణ, మూసివేసిన నాలుగు డిపోల పునరుద్ధరణపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో తమ ఉద్యమాన్ని కొనసాగించాలని ఏపిపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ నిర్ణయించింది. ఆదివారం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా విద్యుత్ బస్సుల నిర్వహణ వల్ల ఆర్టీసీ, ప్రయాణికులు, ఉద్యోగులకు కలిగే నష్టాలను వివరిస్తూ మూసివేసిన డిపోలను పునరుద్ధరించడం సహా 30 డిమాండ్లతో గత నెలలో యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. టి. కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, ఇతర అధికారులతో పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ, శనివారం అందిన డ్రాఫ్ట్ మినిట్స్‌లో ప్రధాన డిమాండ్లపై స్పష్టత లేకపోవడంతో రెండో దశ ఉద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

రెండో దశ ఉద్యమంలో భాగంగా ఈ నెల 14 నుంచి 19 వరకు ప్రజాప్రతినిధులను కలిసి మద్దతు కోరుతూ వినతిపత్రాలు అందజేయనున్నట్లు జేఏసీ వెల్లడించింది. ఈ నెల నుంచే ఆర్టీసీ ఉద్యోగుల సంతకాల సేకరణ చేపట్టి, ఈ నెల 27న నిర్వహించే 'గ్రీవెన్స్ డే' సందర్భంగా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపింది. అలాగే ఈ నెల 30న విజయవాడలో జేఏసీ రాష్ట్ర సమావేశం నిర్వహించి మూడో దశ ఆందోళన కార్యక్రమాలను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. సమావేశంలో జేఏసీ కో-కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, సి.హెచ్. సుందరయ్య, కట్టా సుబ్రహ్మణ్యం, ఎస్.వి. శేషగిరిరావు, కె. సూర్యప్రకాశరావు, డి. మాల్యాద్రితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467